ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 8 ఏప్రిల్ 2025





రోగుల సంచారం పెద్దగాలేని పొగతోటలోని ఆసుపత్రుల ప్రధాన వీధి

'ఆరోగ్యశ్రీ' సేవలకు బ్రేక్!

జిల్లాలోని 35 ఆసుపత్రుల్లో వైద్యసేవలు బంద్

అత్యవసర సేవలు మాత్రమే కొనసాగింపు

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ (ఆరోగ్యశ్రీ) కింద అందించే వైద్యసేవలు సోమవారం జిల్లాలో చాలా వరకు నిలిచిపోయాయి. ఏపీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశా) ఇచ్చిన పిలుపు మేరకు నెట్‌వర్క్ ఆసుపత్రులు తమ సేవలను ఆపేశాయి. రోగులకు అత్యవసర వైద్యసేవలు మాత్రం అందచేస్తున్నాయి. జిల్లావ్యాప్తం గా 132 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో 35 ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద అత్యవసర వైద్యచికిత్సలు అందించే ఆసుపత్రులు, 31 దంత వైద్య శాలలు ఉన్నాయి. మిగిలినవన్నీ ప్రభుత్వ ఆసుపత్రులే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు కొనసాగాయి. ఇక ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి తప్ప మిగిలిన ఆసుపత్రులన్నీ తమ ఓపీ సేవలను ఆపేశాయి. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో మూడేళ్లుగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.కోట్ల బకాయిలు పెట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ ఆయా ఆసుపత్రులకు రూ. 150 కోట్లకు పైగా బకాయిలు పేరుకు పోయాయి. దీంతో వైద్యులు, సిబ్బందికి నెలవారీ వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ స్థితిలో ఆశా ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేశాయి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని నెట్‌వర్క్ ఆసుప త్రుల నిర్వాహకులు హెచ్చరి స్తున్నారు. ఇదిలాఉంటే నెట్‌వర్క్ ఆసుపత్రుల నిరసనలపై ప్రభుతం స్పందించకుంటే బంద్ చేస్తామని ఆశా పేర్కొంది.

ఆరు మండలాల్లో జొన్నల కొనుగోళ్లు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆరు మండ లాల్లో కనీస మద్దతు ధరతో జొన్నల కొనుగోలు ప్రక్రియ మొదలు పెట్టామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాడు, వరికుంటపాడు, ఆత్మకూరు, పొదలకూరు, కలువాయి, చేజర్ల మండలాల్లో హైబ్రిడ్ రకం జొన్నలు క్వింటం రూ.3371, మాల్దండి రకం క్వింటం రూ.3421 చొప్పున మద్దతు ధర ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే జొన్నలు విక్రయించాలని రైతులను కోరారు.

న్యాయాధికారుల బదిలీ

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా పనిచేస్తున్న సీ.యామినిని కడప జిల్లా ప్రధాన న్యాయాధికారిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో అనంతపురం జిల్లా ప్రధాన న్యాయాధికారిగా పనిచేస్తున్న జీ. శ్రీనివాస్ నియమితులయ్యారు. అలాగే నెల్లూరు ఫ్యామిలీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారిగా పనిచేస్తున్న కే. వెంకట నాగపవన్‌ను తిరుపతి జిల్లా గూడూరు ఏడవ అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న షేక్ పర్వీన్ సుల్తానా బేగంను గుంటూరు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారిగా నియమించారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సోమవారం ఉత్తర్వులు అందాయి. బదిలీ అయిన న్యాయాధికారులు ఈనెల 21 లోగా బాధ్యతలు చేపట్టాలని హైకోర్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

రక్తపోటు.. చక్కెర కాటు

జిల్లాలో ప్రతి పాతికమందిలో ఒకరు హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారా!? అలాగే ప్రతీ నలభై మందిలో ఒకరు డయాబెటిస్ బారిన పడ్డారా!? అంటే ప్రభుత్వ గణాంకాలు అవుననే చెబుతున్నాయి. వినడానికి కొంచెం ఉన్నా హైపర్ టెన్షన్, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎన్‌సీడీ సర్వే (దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ సర్వే) పూర్తయింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సర్వేలో వెల్లడైన కొన్ని వ్యాధుల తీవ్రతను చూస్తే ఆందోళన కలిగిస్తోంది.

నెల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల ఆరోగ్యస్థితిగతులపై ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఎన్‌సీడీ సర్వే పూర్తవగా, ఆ సర్వే వివరాలను విడుదల చేశారు. అందులో జిల్లాలోని వివరాలనూ వెల్లడించారు. ఈ సర్వేలో వెల్లడైన కొన్ని వ్యాధుల తీవ్రతను చూస్తే ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా లివర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడిన వారు జిల్లాలోనే ఎక్కువగా ఉన్నారు. పొల్యూషన్ ఎక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా అంచనా వేస్తున్నారు. లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు రాష్ట్రవ్యాప్తంగా 30,646 మంది ఉండగా వారిలో ఒక్క నెల్లూరు జిల్లాలోనే 2168 మంది ఉన్నారు. అలానే శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు రాష్ట్రవ్యాప్తంగా 54,362 మంది ఉండగా వారిలో జిల్లాలో 5,204 మంది ఉన్నారు. ఈ రెండూ దీర్ఘకాలిక వ్యాధులతో ఎక్కువగా బాధపడుతున్న జిల్లాల్లో నెల్లూరు మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో 20 లక్షల మంది జనాభా ఉంటే వారిలో సుమారు 95 వేల మంది హైపర్‌టెన్షన్, డయాబెటిస్ వంటి వాటితో బాధపడు తున్నారు. మారుతున్న జీవన స్థితిగతులే ఇందుకు ప్రధాన కారణంగా వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు.





- జీవనశైలిలో మార్పులతో ప్రమాద ఘంటికలు
- ఎన్‌సీడీ సర్వే వివరాల వెల్లడి
- 94,677 మందికి హైపర్‌టెన్షన్, డయాబెటిస్
- శ్వాసకోస, లివర్ సమస్యల్లో జిల్లా టాప్
- 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' పేరుతో ప్రత్యేక కార్యాచరణ

● దృష్టిపెట్టిన ప్రభుత్వం

ఈ దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా ఈదఫా ఎన్‌సీడీ సర్వేను వినూత్నంగా నిర్వహించింది. జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని అక్కడ ఏ రకమైన వ్యాధులతో ఎక్కువగా బాధపడుతున్నారన్న విషయాలను గుర్తించింది. జిల్లాలో లివర్, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించింది. అందుకు తగిన విధంగా భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ నియోజకవర్గంలో కనీసం ఒక 100 నుంచి 300 పడకల ఆసుపత్రి ఉండేలా భావిస్తోంది. ఇటువంటి ఆసుపత్రులు లేని నియోజకవర్గాల్లో పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణకై పరీక్షలకు చాలా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇకపై ఆ ఖర్చులను తగ్గించి, తక్కువ ధరకే పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. అలానే ప్రతీ నియోజవకర్గంలోనూ డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడకు ఏ వ్యాధితో వెళ్లినా అందుకు అవసరమైన వైద్యుడి వద్ద ఫాస్ట్రాక్ అపాయింట్‌మెంట్ బుక్ చేస్తారు. ఇంకా అవసరమైతే స్పెషలిస్ట్‌లతో వర్చువల్ కన్సల్టేషన్ ఇస్తారు. ఈ డిజిటల్ నెర్వ్ సెంటర్ల నుంచే తాలూకా, జిల్లా ఆసుపత్రులకు రిఫరల్ అపాయింట్‌మెంట్లు ఇస్తారు. అలానే పేషెంట్‌కు సంబంధించి ఆసుపత్రుల రికార్డులన్నింటినీ స్కాన్ చేసి భద్రపరుస్తారు.

వ్యాధి పేరు	రాష్ట్రంలో కేసులు	జిల్లాలో కేసులు
హైపర్‌టెన్షన్	19,78,699	82,116
డయాబెటిస్	11,13,639	56,250
హైపర్‌టెన్షన్+ డయాబెటిస్	20,78,999	94,677
గుండె	2,61,100	11,277
క్యాన్సర్	1,19,397	5,487
లివర్	30,646	2,168
శ్వాసకోశ	54,362	5204
నరాలు	1,07,433	5,837
కిడ్నీ	1,73,479	8,017





పొలంలో నిల్వ ఉన్న పసుపు కొమ్ములు

పసుపు... పసిడాయే!

గత నెలలో క్వింటం రూ.8.500.. ఇప్పుడు 12,700

సాగుదారుల్లో ఆనందం

ఉదయగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పసుపు సాగుదారుల ఇంట సిరులు కురుస్తున్నాయి. రోజురోజుకు ధరలు పెరుగుతుండటంతో వారి కష్టానికి ఫలితం దక్కుతోంది. గతేడాది జూన్, జూలై నెలల్లో ఉదయగిరి ప్రాంతంలోని రైతులు పసుపు సాగు చేశారు. ఎకరా సాగుకు దున్నకం, విత్తనం, ఎరువులు, పురుగు మందులు కలిపి రూ.1.50 లక్షల వరకు ఖర్చువుతోంది. ఈ ఏడాది జిల్లాలో సుమారు 600 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ప్రస్తుతం తవ్వకాలు పూర్తయి ఉడికిచేందుకు పసుపుగొమ్ములను పొలాల్లో నిల్వ ఉంచారు. కొందరు రైతులకు ఎకరాకు 25 నుంచి 35, మరికొందరికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 2008, 2009లో క్వింటం పసుపు ధర రూ.18 వేలు పలకగా, 2010 నుంచి 2023 వరకు క్వింట రూ.5వేల నుంచి 6,500 వరకు మాత్రమే పలికింది. దీంతో రైతులు నష్టాలు చవిచూశారు. అయితే 2024లో క్వింటం రూ.16 వేలు పలికడంతో గట్టెక్కారు. ఈ ఏడాది మార్చిలో క్వింటం రూ.8,500 పలకగా, ప్రస్తుతం రూ.12,700 పలుకుతోంది. ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

ఈ-శ్రమ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక శాఖల్లో పనిచేసే అన్ని రంగాల సంఘటిత, అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే అమెజాన్, జొమేటో, సిగ్గీకొరియర్ బాయ్స్, ఓలా, ఫ్లిప్‌కార్ట్ కార్మికులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే ప్రధాని జన ఆరోగ్య యోజన కార్మికులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులయినవారు కార్మికశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 17 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వివరించారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 52.590 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు నిలుపుదల చేశారు. కండలేరుకు 100 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

క్వార్ట్జ తవ్వకం, తరలింపులో..

కాకాణిది కీలక పాత్ర

అనుమతి లేకుండా పేలుడు పదార్థాల వినియోగం

ఆయనకు పూర్వ నేరచరిత్ర ఉంది

ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు: ఏజీ

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ ఖనిజాన్ని అక్రమంగా తవ్వి తరలించడంలో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిది కీలక పాత్ర అని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. కాకాణి దాఖలుచేసిన క్వాష్ పిటిషన్, ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం ఆయన హైకోర్టులో వాదనలు వినిపించారు. 'పొదలకూరు మండలం పరిధిలో క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌ను కట్టడి చేయలేకున్నామని, అక్రమ మైనింగ్‌ను నిలువరించేందుకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది సహకరించడం లేదని ఉన్నతాధికారులకు గత ఏడాది జనవరిలో జిల్లా మైనింగ్ అధికారి లేఖ రాశారు. అక్రమ తవ్వకాల వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని అందులో పేర్కొన్నారు. క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వి, తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లా మైనింగ్ అధికారి లేఖ రాసినప్పటికీ పోలీసులు కేసులు నమోదు చేయలేదు. మైనింగ్ లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవద్దని.. గతంలో తవ్వకాలు చేసిన రుస్తుం మైకా మైనింగ్ కంపెనీ యజమానిని కాకాణి బెదిరించారు. దీనిపై ఆ కంపెనీ యజమాని వాంగ్మూలం కూడా ఇచ్చారు. అనుమతుల్లేకుండా పేలుడు పదార్థాలు ఉపయోగించి బ్లాస్టింగ్ నిర్వహించడంతో మైనింగ్ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎస్టీల నివాసాలు దెబ్బతిన్నాయి. ప్రశ్నించిన ఎస్టీలను కాకాణి అనుచరులు బెదిరించడమేకాక దూషణలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో పిటిషనర్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదు చేసిన సెక్షన్లు చెల్లుతాయి. ఆయనకు పూర్వ నేరచరిత్ర ఉంది. 10 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. క్వాష్, ముందస్తు బెయిల్ పిటిషన్ పొందేందుకు అనర్హుడు' అని స్పష్టంచేశారు. కాకాణి తరపున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అక్రమ మైనింగ్ విషయంలో పిటిషనర్ పాత్రపై నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు. రాజకీయ కారణాలతో కేసు పెట్టారని.. విచారణకు హాజరుకావాలని పిటిషనర్ కుమార్తె, అల్లుడికి నోటీసులు ఇచ్చి పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. అరెస్టు నుండి రక్షణ కల్పించడంతో పాటు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో బుధవారం (9న) నిర్ణయం వెల్లడిస్తానని న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ప్రకటించారు.



మాజీ మంత్రి పిటిషన్లపై హైకోర్టులో ముగిసిన వాదనలు

రేపు నిర్ణయం వెల్లడిస్తామన్న న్యాయమూర్తి

కాకాణి అల్లుడూ డుమ్మా!

ముగ్గురు నిందితుల్లో ఒక్కరే హాజరు ● ఇప్పటికీ పత్తాలేని మాజీ మంత్రి

నెల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డే కాదు.. ఆయన అల్లుడు గోపాలకృష్ణారెడ్డి కూడా పోలీసుల ముందుకు రావడం లేదు. సోమవారంనాటి విచారణకు ఆయన డుమ్మా కొట్టారు. కాకాణి సన్నిహితుడైన కాంట్రాక్టర్ ఊరబిండి ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు చైతన్యలు కలిసి ఒక లాజిస్టిక్ కంపెనీని ప్రారంభించారు. ఆ కంపెనీ పేరుతో వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగ వద్ద 50 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా తీసుకున్నారు. ఈ భూమి కొనుగోలుకు అవసరమైన డబ్బు కాకాణి అల్లుడి నుంచే వచ్చిందన్నది అభియోగం. ఇందుకు బలం చేకూరుస్తూ ఈ లాజిస్టిక్ కంపెనీకు సీఈవోగా గోపాలకృష్ణారెడ్డి వచ్చి చేరారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురికీ పోలీసులు ఆదివారం నోటీసులిచ్చి.. సోమవారం విచారణకు రమ్మన్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో విచారణకు ప్రభాకర్‌రెడ్డి మాత్రమే హాజరయ్యారు. పోలీసులు గంటపాటు ఆయన్ను ప్రశ్నించి కీలకమైన సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. తనకు ఆరోగ్యం బాగోలేదని, మరోరోజు విచారణకు వస్తానని చైతన్య పోలీసులకు తెలియజేయగా.. గోపాలకృష్ణారెడ్డి మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది.



నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయం నుంచి బయటకొస్తున్న ఊరబిండి ప్రభాకర్‌రెడ్డి

ఇంకోవైపు.. అక్రమ మైనింగ్ కేసులో ఇప్పటికి మూడు సార్లు పోలీసులు నోటీసులు జారీ చేసినా కాకాణి హాజరుకాలేదు. అసలు ఎక్కడున్నారో కూడా తెలియడం లేదు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న వేమిరెడ్డి అరవింద్‌రెడ్డి, కొండా శివారెడ్డిల రిమాండ్‌ను గూడూరు కోర్టు మరో 14 రోజులు పొడిగించింది.

జూనియర్ కళాశాలల్లో

హేతుబద్ధీకరణ

● జిల్లాలో 40కిపైగా అధ్యాపక పోస్టుల మంజూరు

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల హేతుబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 455 జూనియర్ లెక్చరర్స్ సరప్లస్ పోస్టులను గుర్తించగా, వీటిలో 214 పోస్టులను యథాతథంగా అవసరం ఉన్న కొత్త కళాశాలలకు బదిలీ చేస్తున్నారు. మిగిలిన 241 పోస్టులను ఇతర సబ్జెక్ట్‌లకు మార్పు చేసి కొత్త కళాశాలలకు కేటాయించనున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన దామరమడుగు, తోటపల్లిగూడూరు, సౌత్‌మోపూరు, వెంగమాంబాపురంలలోని జూనియర్ కళాశాలలకు గతంలో ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదు. ప్రస్తుత హేతుబద్ధీకరణలో ఒక్కో కళాశాలకు పదిపోస్టుల చొప్పున 40 పోస్టులు మంజూరు కానున్నాయని ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు. వీటితో పాటు మిగిలిన కళాశాలల్లో కూడా సర్‌ప్లస్ పోస్టులను గుర్తించి అవసరమైన చోట సర్దుబాటు చేస్తామన్నారు. జూనియర్ కళాశాలల్లో ఇప్పటికే ద్వితీయ సంవత్సరం ప్రారంభం కాగా, 7వతేదీ నుంచి ప్రథమ సంవత్సరం కూడా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అధ్యాపకుల నియామకాలు కూడా వేగవంతంగా చేపడతామని తెలిపారు.

మాతా,శిశు మరణాలు నివారించాలి

● ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతా,శిశు మరణాలను నివారించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భం గా నగరంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రదర్శన నిర్వ హించింది. వెంగళరావు నగర్ సీహెచ్‌సీ వద్ద డీఎంహెచ్‌వో జెండాఊపి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు - ఆశాజనకమైన భవిష్యత్తు' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయా లన్నారు. మహిళల దీర్ఘకాలిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో మాతా, శిశు మరణా లను తగ్గించటానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని కోరారు. కార్య క్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, డెమో కనక రత్నం, వైద్యాధికారులు రీనాభారతి, డాక్టర్ కుసుమ కిరణ్ పాల్గొన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

వృద్ధులకు డిజిటల్ కార్డులు

గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం

సంగం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు సేవలు పొందేందుకు 60 ఏళ్ల నిండిన వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డును ప్రభుత్వం ఇవ్వనున్నది. ఈ కార్డును డిజిటల్ రూపంలో అందించనుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ డిజిటల్ కార్డు అందించేలా కొత్త సేవను తీసుకువచ్చింది. అక్కడ నుంచే వారు దరఖాస్తు చేసుకోవాలి. ఇటీవల అమరావతిలో జరిగిన సీనియర్ కౌన్సిల్, స్టేట్ అడ్వైజర్ బోర్డు ఆన్ డిజిటబులిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవటంతో సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీకి మార్గం సుగమమైంది. ఈ కార్డుతో పలు ప్రయోజనాలు ఉన్నాయి.

- భారత రైల్వే సంస్థ రైలు ప్రయాణంలో 60 ఏళ్లు నిండిన పురుషులకు, 58 ఏళ్లు నిండిన మహిళలకు టికెట్‌పై 40 శాతం రాయితీ, 80 ఏళ్లు నిండిన వారికి 50 శాతం రాయితీ కల్పిస్తున్నది. కొన్ని ప్రైవేట్ బస్సు సర్వీస్‌లు, ఎయిర్ లైన్స్ సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరలు తగ్గిస్తున్నాయి.
- ఈ కార్డు ఉంటే ఆస్పత్రుల్లో ప్రత్యేక క్యూలు, రాయితీలకు అవకాశం ఉంది. మందులు, డయాగ్నోస్టిక్ టెస్ట్‌ల ధరలు తగ్గుతాయి.
- సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీ, ఎఫ్‌సీఎస్ఎస్ సేవింగ్ స్కీమ్‌లపై అధిక వడ్డీ, ఇన్‌కంట్యాక్స్ మినహాయింపు (80 ఏళ్ల పైబడినవారికి రూ. రూ. 50 వేల వరకు)ఉంటుంది.
- ఇందిరాగాంధీ నేషనల్ ఓల్డేజ్ పెన్షన్ స్కీమ్ వంటి పథకాలకు అర్హత, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అదనపు సబ్సిడీలు అందుతాయి.
- మ్యూజియం, సినిమా హాళ్లు, పార్కుల్లో ఎంట్రీ ఫీజుల్లో రాయితీ, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలో తగ్గింపు ఉంటాయి.
- వృద్ధుల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించడం, ఆరోగ్యం భద్రతకు ప్రాధాన్యం, ప్రభుత్వ ప్రయోజనాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడం వంటి సేవలు ఈ కార్డు ద్వారా అందుబాటులోకి రానున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100) : 440

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8534
వెండి కిలో ధర	రూ. 92.500
వెండి ఒక గ్రాము	రూ.95.50

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగసముద్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణశాఖల పరిధిలో జరిగిన రూ.13.67 కోట్ల పనులకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఏపీవో షేక్ సమీర్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పనులకు సంబంధించి గత నెల 18 నుంచి 31 వరకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో విచారించారని పేర్కొన్నారు. తద్వారా రూపొందించిన నివేదికలను ప్రజా వేదికలో అధికారులకు, ప్రజలకు చదివి వినిపిస్తారని తెలిపారు.

న్యూస్ బాక్స్

336 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 425 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 336 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-2, నోబిడ్-63, ఆర్‌ఆర్-3, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-13 కారణాలతో 89బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.263.61గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ తెలిపారు.

గోవు దాడిలో నలుగురికి గాయాలు

అల్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అల్లూరులో సోమవారం రాత్రి ఓ గోవు దాడిలో నలుగురు పాదాచారులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నలుగురు వ్యక్తులు వైఎస్‌ఆర్ విగ్రహం సమీపంలో ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా వీధుల్లో తిరుగుతుండే ఒక గోవు ఒక వ్యక్తిపై దాడి చేసింది. పక్కనే ఉన్న మరో ముగ్గురు దానిని నిలువరించేందుకు ప్రయత్నించగా వారిపై కూడా దాడి చేసింది. స్థానికులు అతి కష్టంపై దానిని నిలువరించారు. అప్పటికే గాయపడిన నలుగురిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

జగనన్న కాలనీల అవినీతిపై విచారణ జరిపించాలి

కావలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో స్టీలు, సిమెంట్, ఇసుక దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో ఎం.సన్నీ వంశీ కృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పెయ్యల శ్రీను, డీ.వెంకటేశ్వర్లు, జెడ్డా వాసు, తిరుపతి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి పలువురి సంతాపం

కొండాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గొర్రెపాటి లక్ష్మీనరసయ్య(75) ఆదివారం రాత్రి మృతి చెందగా పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ లక్ష్మీనరసయ్య కుటుంబ సభ్యులను ఫోనులో పరామర్శించి పార్టీ ఆదుకుంటుందని చెప్పారు.

కోలాహలంగా కోదండరాముడి రథోత్సవం



అల్లూరు: కోదండరాముడి రథోత్సవం

అల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అల్లూరుపేటలో వెలసి ఉన్న కోదండరాముడి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అల్లంపాటి ఇందిరమ్మ, అల్లంపాటి లోకేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూలాలంకరణ చేసిన రథంలో కొలువుదీరిన సీతా లక్ష్మణ సమేత కోదండరాముడు పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అల్లూరు తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కోదండరాముడి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

● కనుల పండువగా...

కావలిటౌన్ : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని దక్షిణంపేట రామాలయం వద్ద సోమవారం సాయంత్రం ప్రారంభమైన రథోత్సవం మాగుంట పార్వతమ్మ రోడ్డు మీదుగా పట్టణ పురవీధుల్లో సాగింది. సీతారాములు రథంపై ఆసీనులై ప్రజలకు దర్శనమిచ్చారు. జై శ్రీరామ్ నామస్మరణతో భక్తులు రథం లాగారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు, భక్తబృందం పాల్గొన్నారు.



కావలి : సీతారాముల రథోత్సవంలో భక్తులు

కొండాపురం : మండలంలోని భీమవరప్పాడు, గుడవళ్లూరు గ్రామాల్లోని రామాలయాలలో పారువేట సందర్భంగా సీతారాముల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఎమ్మెల్సీ రవిచంద్రకు పౌరసన్మానం

● గ్రంధి విగ్రహావిష్కరణ ● కావలికి ఇద్దరు మంత్రుల రాక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత తొలిసారి కావలి నియోజకవర్గంలో అడుగుపెడుతున్న సందర్భంగా మంగళవారం పౌరసన్మానం చేయనున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే టీడీపీ నేత గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కావలిలోని ఆయన నివాసంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిలు మంగళవారం కావలికి వస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా తన ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఏర్పాటు చేసిన దివంగత టీడీపీ నేత గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రులు మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు ఆవిష్కరిస్తారన్నార. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి ట్రంకు రోడ్డులోని సెల్ఫీ ఐకాన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీద రవిచంద్రకు పౌరసన్మానం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

ప్రతిభావంతులకు అభినందన

కావలిటౌన్ : ఇంటర్‌నేషనల్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ఐఎంవో, ఐఎస్‌వో పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన కావలి నలందా ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులను సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో నలందా డైరెక్టర్ ఎండీ వశీం, తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ : త్రుటిలో తప్పిన ప్రమాదం



తెగిన కరెంట్ తీగ వద్ద కాపాలా ఉన్న పోలీసులు

కావల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ట్రంకురోడ్డులో రైల్వే రోడ్డుకు వెళ్లే మలుపు వద్ద ప్రధాన తపాలా కార్యాలయం పక్కన కరెంట్ తీగ (కండక్టర్) సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు తగలటంతో తెగి నేలపై పడింది. అప్పుడే కొంత మంది రోడ్డు క్రాస్ చేసిన తర్వాత కరెంట్ వైరు తెగి నేలమీద పడింది. ఆ సమయంలో అక్కడ ప్రజలు లేక పోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. కరెంట్ తీగలను బస్సు ఒక చోట తగిలితే అది మరొక చోట తెగడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా ఎక్కడ తీగ మెతకగా ఉంటుందో అక్కడ తెగుతోందని విద్యుత్ శాఖ సిబ్బంది అంటున్నారు. కరెంట్ తీగ తెగిన విషయం స్థానికులు పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో పోలీసులుఅక్కడకు చేరుకుని ఆ మార్గంలో ఎవరినీ రాకుండా రక్షణగా నిలిచి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరాను నిలిపి వేసిన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తెగిన కరెంట్‌తీగకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కావలిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెన్షనర్స్ భవనంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య పర్యవేక్షణలో వైద్యరత్న బిరుదాంకితుడు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు అధ్యక్షతన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు అపోలో వైద్యశాలకు చెందిన గుండె, మూత్రపిండాలు, జీర్ణకోశ వ్యాధుల వైద్యులు షర్మిలి నౌషీన్, మస్తాన్‌వలి, సతీష్ పగడాల పాల్గొని పెన్షనర్లకు పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. రవికుమార్, వెంకయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరసన

బిట్రగుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైల్వే రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై సోమవారం బిట్రగుంట రైల్వే లాబీ కార్యాలయం ఎదుట సౌత్ సెంట్రల్ బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు మద్దిబోయిన వెంకటశేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వర్లు మాటాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పీవీఆర్ బాబు, ఆర్వీ నరసయ్య, రవి, రాజేష్, కాలేషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎస్‌లో ప్రాంగణ ఎంపికలు

కావలిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సింగపూర్‌కు చెందిన ఏ2000 సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేష్, ఏవో రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుకట్ట గిరిజన కాలనీకి నీటి సరఫరా చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని చెరువుకట్ట గిరిజన కాలనీవాసులకు నీటి సరఫరా చేయాలని సీపీఎం నేతలు కాలనీ గిరిజనులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ చెరువుకట్ట గిరిజన కాలనీలో 100కు పైగా కుంటుంబాలు ఉంటున్నప్పటికీ నీటి సౌకర్యం కల్పించలేదన్నారు. మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు సక్రమంగా అందడంలేదన్నారు. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి దాతల కృషి అభినందనీయం

లింగసముద్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి దాతలు కృషి అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు పేర్కొన్నారు. లింగసముద్రం హైస్కూల్‌లో 1966లో పిడుగు కోనయ్య, కోనమ్మల దాతృత్వంతో నిర్మించిన తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో వారి ముని మనవళ్లు పిడుగు వెంకటరాజు, వెంటక రంగారావులు రూ.4 లక్షలతో నాలుగు తరగతి గదులకు మరమ్మతులు చేయించారు. అందుకు సబంధించిన శిలాఫలకాన్ని సోమవారం రిటైర్డు ప్రిన్సిపాల్ కొట్టే వెంకటాచార్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరాజు, శిరీష, వెంకట రంగారావు, కళ్యాణి దంపతులు, మొగిలిచెర్ల హైస్కూల్ హెచ్‌ఎం కె సూర్యప్రకాశరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ దగ్గు వెంకట రమేష్, యు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కావలిరూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆముదాలదిన్నెలో సోమవారం పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వెంకటరమణయ్య పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. ఎస్టీ కాలనీలో చేతి పంపులు, కుళాయిల్లో నీరు మురుగుగా మారి రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఇలాగైతే రోగాలు రావా అని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి ఎస్టీ కాలనీలో చేతి పంపుల్లో నీరు రోడ్డుపైకి చేరకుండా కాలువలు తీసి బ్లీచింగ్ పిచికారీ చేయించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం

కావలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బంది పడకుండా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆద్వి ఫౌండేషన్ వారి సహకారంతో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజరు ఎం.కల్పన, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, సభ్యులు హరినారపరెడ్డి, మోడరన్ నరసింహం, ఆరికట్ల మధుసూదనరావు, జనిగర్ల మనోహర్, ఆద్వి ఫౌండేషన్ అధ్యక్షుడు బెజవాడ ప్రసన్నకుమార్, సభ్యుడు పీ.వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కుల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బిట్రగుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రక్కుల చోరీ కేసులో నిదితుడిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై భోజ్యా తెలిపిన వివరాల మేరకు.. ఏబీ కండ్రిగకు చెందిన షేక్.షరీఫ్ ఇంటి ఇటీవల చోరీకి గురైన రెండు ట్రాక్టర్ ట్రక్కులు ఉన్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేసి ట్రక్కులతో పాటు చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్ ఇంజన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

అంకమ్మకు వెండి జడ, 110 వెండి పుష్పాల బహూకరణ



వెండి జడ అందిస్తున్న సూర్యప్రకాశరావు

కందుకూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయానికి కావలికి చెందిన చలంచాల్ల సూర్యప్రకాశరావు, సీతాదేవి దంపతులు బంగారుతాపడంతో వెండి జడ, 110 వెండిపుష్పాలను బహూకరించారు. అమ్మవారి పట్ల ఉన్న భక్తితో వృద్ధ దంపతులు సోమవారం ఆలయానికి వచ్చి ఈవో కార్తీక్‌కు వీటిని అందజేశారు. ఈఓ మాట్లాడుతూ వీటి విలువ రూ. 1.70 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ విశ్రాంత ఈవో రామ్‌కుమార్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు మంచిరాజు మురళీమోహన్, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, గాండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ఊరేగిన సంగమేశ్వరుడు



సంగం, ఏప్రిల్ 7: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సంగమేశ్వరుడు శేష వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా కామాక్షీదేవి, సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శేష వాహనంపై ఉంచి సంగం పుర వీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవానికి శాఖవరపు శ్రీహరి, శివకుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్యవైశ్య సత్రంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. గ్రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో దాతల సహకారంతో బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఉత్సవాలకు వచ్చే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

సీతారాముల గ్రామోత్సవం



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోదండరామస్వామి ఆలయంలో సోమవారం స్వామివార్లను అశ్వ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

వింజమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 9 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 8వ తేదీన అంకురార్పణ, 9న ధ్వజారోహణ, 10న పొన్నమాను సేవ, 11న హనుమంత సేవ, 12న గరుడసేవ, 13న కల్యాణం, 14న రథోత్సవం, 15న వసంతోత్సవం, 16వ తేదీ ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు సాంస్కృతిక, అన్న వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఈవోపీఆర్డీ



రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈవోపీఆర్డీ భార్గవి సూచించారు. మండల కేంద్రంలోని బిట్-1 సచివాలయాన్ని ఆమె సోమవారం తనిఖీ చేసి సిబ్బంది హాజరు, పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో అందాల్సిన సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామనాథరెడ్డి, శిల్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ హసానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఏపీవోగా శ్యామల బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఏపీవోగా ఎన్ శ్యామల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె జలదంకి నుంచి సీతారామపురానికి బదిలీపై వచ్చారు.

యువతకు ఉచిత శిక్షణ

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీడ్స్ స్వచ్ఛంద సంస్థలో యువతీ, యువకులకు కంప్యూటర్, సోలార్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గలవారు 9441767176, 9908217465 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ఆత్మకూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

● రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మర్రిపాడు: కుట్టు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, మర్రిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం అని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ, ఈడబ్ల్యుఎస్ సహకారంతో ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ కేంద్రాలను ఆయన సోమవారం ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, మర్రిపాడు, సంగం మండలాల్లో ప్రాంభించారు. ముందుగా మర్రిపాడు మండలంలో, అనంతరం ఆత్మకూరు మున్సిపాల్టీలో, మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 రోజుల పాటు శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. ఈఏడాది పాఠశాలలు తెరిచే సమయానికి తల్లికి వందనం పథకాన్ని అమలుచేయనున్నామని తెలిపారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20వేలు అందజేస్తామన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరికీ మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తా మన్నారు. ఆత్మకూరులో రూ. 56 కోట్లతో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రూ. 6.5 కోట్లు ఆత్మకూరు బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, ఈనిధులతో అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి రవితేజ కల్యాణ మండపం వరకు రోడ్డు, డివైడర్ నిర్మాణం చేపడతామని, ఆత్మకూరు జిల్లా వైద్య శాలను 300 పడకల వైద్యశాలగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి పావని, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు

అనంతసాగరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు చెరువు పరిధిలోని పంట కాలువకు సంబంధించిన ఉప కాలువను కొందరు పూడ్చేసి నీరు రాకుండా అడ్డుకొంటున్నట్లు రైతులు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దారు సుభాషిణికి ఫిర్యాదుచేశారు. దీంతో తమ పొలాలు బీడుగా ఉంటున్నాయని, విచారించి న్యాయం చేయాలని కోరారు. అలాగే అదే గ్రామంలో పంచాయతీకి చెందిన మంచినీటి బావిని రేవూరు సంటయ్య అనే వ్యక్తి పూడ్చేసి ఆక్రమించాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయంలో ఏవో మస్తాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కర్నూల్‌కు బస్సు సర్వీసు ప్రారంభం

ఉదయగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిపో నుంచి కర్నూల్‌కు బస్సు సర్వీసును ప్రారంభించినట్లు సోమవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయగిరిలో ఉదయం 7 గంటలకు బయలుదేరి బద్వేలు, మైదుకూరు, నంద్యాల మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు కర్నూల్‌కు చేరుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కర్నూల్‌లో బయలుదేరి రాత్రి 9 గంటలకు ఉదయగిరికి చేరుతుందన్నారు. కర్నూల్, నంద్యాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ బస్సు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీనియర్ సిటిజన్ సింగనబోయిన చెన్నకేశవరావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు పాలకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి



సీతారామపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, శేఖర్‌రాజు, తిరుపాల్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు మజీద్ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల ఆధర్వంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో చిన్నయ్య, పిహెచ్‌ఎన్ రాజ సులోచన, సూపర్వైజర్లు రషీద్, కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

●వింజమూరు: కేఎంఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సుజాతనగర్ కాలనీలో మసీద్ వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ ఎన్ సుజన హాజరయ్యారు. విశ్రాంత డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాశిలామణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. అనంతరం సర్పంచ్ సుజనను సన్మానించారు. కార్య క్రమంలో డాక్టర్ ప్రశాంత్, స్నేహ, ప్రీతిక, నాయకులు ఖాజామస్తాన్, మాశిలామణి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి

ఉదయగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో చెరువు పైభాగంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని సోమవారం రైతులు తహసీల్దారు సుభద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన రీసర్వేలో కొందరు తమ పేర్లను రికార్డుల్లో నమోదు చేసుకుని పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారన్నారు. సర్వేచేసి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. స్పందించిన తహసీల్దారు వెంటనే మండల సర్వేయరును పిలిచి పరిశీలించి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

భూ సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలువురు వినతులు సమర్పించారు. కాగా, ఎన్నిసార్లు అర్జీలు సమర్పించినా పరిష్కారం కావడంలేదని ఓ రైతు తహసీల్దారు సుభద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు జహీర్‌ఖాన్‌లపై వాదనకు దిగాడు. అలాగే పలువురు స్పందన కరువైందని వాపోయారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దేవసేనమ్మ

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్ల అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం వ్యవసాయశాఖ ఏడీ దేవసేనమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

ఏఎస్ పేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా కనబడకుండా పోయిన రాజవోలు గ్రామానికి చెందిన విద్యార్థినిని సీఐ గంగాధర్ ఆమె తల్లికి అప్పగించారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి హైదరాబాదులో ఉన్నట్టు సమాచారం తెలుసుకున్న ఆయన విద్యార్థినిని ఆత్మకూరు స్టేషన్‌కు తీసుకొచ్చి తహసీల్దారు అనుమతితో కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు సీఐకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ షేక్ జమీలబేగం తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.



పాత బండి కనిపిస్తే తరలింపే!

ఇక నుంచి నెల్లూరు నగర రోడ్లపై శిథిలమైన పాత వాహనాలు కనిపిస్తే చాలు... నగర పాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు పట్టుకుపోతారు. ఈ ప్రక్రియకు సోమవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ రోజు వారీ పర్యటనల్లో భాగంగా రోడ్లపై పనికిరాని వాహనాలు అడ్డంగా ఉండటాన్ని గుర్తించారు. వాటిని యజమానులే తొలగించాలని పలు సార్లు సూచించారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ పోలీసులను రంగంలోకి దించి వాటిని తరలిస్తున్నారు.

- నెల్లూరు(సిటీ) (ఆంధ్రజ్యోతి)

ఎస్సీ వర్గీకరణ ఆపాలని మాలల ఐక్యవేదిక ధర్నా

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కన్వీనర్ స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ను సవరించకుండా, పార్లమెంట్‌లో చట్టం చేయకుండా ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలో అమలు చేయడం న్యాయబద్ధం కాదన్నారు. నెల్లూరులో అంబేడ్కర్ పార్క్‌కు 20 ఎకరాలు కేటాయించాలన్నారు. కరెన్సీ నోటుపై అంబేడ్కర్ బొమ్మను ముద్రించాలని కోరారు. బుడగ జంగం బోగస్ కులాలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్లి వెంకయ్య, వాదనాల వెంకటరమణ, టీ అశోక్‌బాబు, ఈదూరు విజయకుమార్, కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.



పాడి విత్తనాలతో భూమి సారవంతం

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వర్షాకాలానికి ముందే పొలంలో పాడి విత్తనాలు వేయడం వల్ల భూమి సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా మేనేజర్ మాలకొండయ్య పేర్కొన్నారు. రుతుపవనాలు రాకముందే పొలాన్ని సాగుకు సంసిద్ధం చేయడంలో భాగంగా సోమవారం దగదర్తి మండలం సున్నంబట్టిలోని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 100 ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్) కిట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంకంటే ముందే పొలాన్ని దున్ని, విత్తనాలు వేసిన అనంతరం వర్షం కోసం వేచిఉండడాన్నే పీఎండీఎస్ పద్ధతి అంటారని వివరించారు. ఈ విధానంలో నీటిని ఆదా చేయవచ్చని, పంటల దిగుబడి కూడా పెంచవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎంటీ మునిరత్నం, ఎంఎంటీఎల్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.



రేపు పింఛనర్ల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం 4 గంటలకు భక్తవత్సలనగర్ లోని పెన్షన్‌భవన్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీవీఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి సంఘ బాధ్యులు, గౌరవ సలహాదారులు హాజరుకావాలని కోరారు.

అండాశయంలో పెద్ద గడ్డ తొలగింపు

- జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్‌లో ఓ మహిళకు అండాశయంలో ప్రమాదకరంగా మారిన పెద్దగడ్డను శస్త్రచికిత్స చేసి తొలగించినట్లు వైద్యులు వెల్లడించారు. సోమవారం జీజీహెచ్‌లో ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధురీ విలేకరులతో మాట్లాడారు. నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్‌కి చెందిన సుబ్బలక్ష్మి(50) కడుపు ఉబ్బరంలో ఆసుపత్రికి వచ్చిందన్నారు. పూర్తిస్థాయి పరీక్షలు జరపగా, ఆమె అండాశయంలో 3.5 కిలోల పెద్ద గడ్డ మెలిక పడి ప్రమాదకరంగా మారిందని వారు వివరించారు. ఈ నేపథ్యంలో ఆ గడ్డతోపాటు గర్భసంచిని తొలగించామన్నారు. దీంతో బాధితురాలు పూర్తిగా కోలుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్తువైద్య నిపుణులు డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ సురేష్, డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవ్వులు

హరి విల్లు బాబు

- సింహపురి హాస్యనటుడిగా గుర్తింపు
- తెలుగు యాసలో నవ్వుల పువ్వులు
- నాటక, టీవీ కళాకారుడిగా ప్రతిభ
- దేశ విదేశాల్లో ప్రదర్శనలు, అవార్డులు
- ప్రభుత్వం నుంచి ఉగాది కళారత్నం పురస్కారం

నటులు ఎందరో ఉంటారు.. సహజ నటులు మాత్రం కొందరే ఉంటారు. అలాంటి వారిలో సింహపురి కళాకారుడు, హరివిల్లు క్రియేషన్స్ అధినేత దోర్నాల హరిబాబు ఒకరు. నాటక, టీవీ రంగాల్లో హాస్యనటుడిగా ఆయనది ప్రత్యేక శైలి. నెల్లూరు యాసలో పలికే సంభాషణలు ఆయనకే సాటి. రాష్ట్రస్థాయిలో ఎన్నో వేదికలపై తన నటనా చాతుర్యంతో నవ్వుల జల్లులు కురిపించారు. వ్యంగ్య చలోక్తులతో సభికుల చప్పట్లు అందుకున్నారు. కేవలం నాటక, టీవీ రంగాలకే పరిమితం కాకుండా ప్రభుత్వం నిర్వహించే ప్రజోపయోగ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని కళాజాతాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి ఇటీవల ఉగాది వేడుకల్లో కళారత్న పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దోర్నాల నరసింహారావు, సీతా మహాలక్ష్మీల కుమారుడు హరిబాబు. ఆయనలో బాల్యం నుంచే కళాభిరుచి ఉంది. పాఠశాల స్థాయిలో సాంస్కృతిక, కళా పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. ఆ తర్వాత ఏసీఎన్ న్యూస్ రీడర్‌గా నెల్లూరు ప్రజలకు సుపరిచితులయ్యారు. ప్రముఖ రంగస్థల నటుడు పీవీ కృష్ణారెడ్డి ద్వారా తొలిసారిగా రంగస్థలానికి పరిచయమయ్యారు. 1980లో హంస అవార్డు గ్రహీత పొన్నాల రామసుబ్బారెడ్డి శిక్షణలో చిత్రనళినీయం నాటకంలో కర్కోటకుడు, జీవలుడు, సత్యహరిశ్చంద్రలో లోహితుడు, కేశవుడు, శకుంతల నాటకంలో భరతుడు, తారాశశాంకం బాల్య చంద్రుడు, సారంగధరలో సుకులుడు, భక్తరామదాసులో శ్రీరాముడు.... ఇలా ఎన్నో పాత్రలు పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. శ్రీరామకృష్ణ నాట్యమండలి ఆధ్వర్యంలో చెన్నై, ఢిల్లీ, ముంబయి, మైసూరు, బళ్లారి తదితర ప్రాంతాల్లో దాదాపు 400 పౌరాణిక నాటక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 1989 నుంచి సాంఘిక నాటకల్లో వివిధ పాత్రలు పోషించి అనేక బహుమతులు సాధించారు.



సీఎం నుంచి ఉగాది అవార్డు అందుకుంటున్న హరిబాబు

దేశవిదేశాల్లో అవార్డులు

- హైదరాబాద్ రేల్ కళామందిర్, మణుగూరు నాటక పరిషత్, సత్తెనపల్లి ప్రగతి కళామండలి, బెంగళూరు తెలుగు విజ్ఞాన సమితి, ఈ కృష్ణా మెమోరియల్ కళాపరిషత్, తదితర పరిషత్తులు నిర్వహించిన పోటీల్లో 19 సార్లు ఉత్తమ హాస్యనటుడిగా బహుమతులు అందుకోవడం హరిబాబు ప్రతిభకు నిదర్శనం.
- నెల్లూరులోని సాంస్కృతిక సంస్థ కళాంజలి బృందంతో కలిసి అనంతరావు రచించి దర్శకత్వం వహించిన మనసున మనసై నాటికలో డాక్టర్ పాత్రధారణకుగాను ఉత్తమ నటుడిగా పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. బుల్లి తెరపై పలు హాస్య కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.
- 2010 సెప్టెంబరులో మలేసియా తెలుగు సంఘం 150 సంవత్సరాల వేడుకల్లో, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టాన్‌టెక్స్) వారి ఆహ్వానం మేరకు డల్లాస్ నగరంలో, గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు వాషింగ్టన్ డీసీ నగరంలోను నవ్వుల ప్రదర్శనలు నిర్వహించి అమెరికన్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకున్నారు.
- పారిశుద్యం, ప్రజారోగ్య కార్యక్రమాల్లో చైతన్య గీతాలు, నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. వరదలు, తుపాను సహాయ కార్యక్రమాల్లో పాల్గొని సేవలు అందించారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం అనమడుగులో బీపీసీఎల్ కంపెనీకి భూములు అప్పగించటానికి బలవంతంగా భూసేకరణ చేయడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పంటలు పండే అనమడుగు భూములను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టటానికి భూసేకరణ చేపట్టడం సరికాదన్నారు. కళకళలాడుతున్న గ్రామాలను నాశనం చేయవద్దని డిమాండ్ చేశారు. అలాగే తోటపల్లి గూడూరు మండలం కృష్ణారెడ్డిపాళెంలో దళితుడైన దామవరపు ఏసుదాసు గుడిసె రోడ్డుకు అడ్డంగా ఉందని, అధికారులు దాన్ని కూల్చేశారన్నారు. అతనికి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకట్రావు , సీఐటీయా నాయకులు మారబోయిన రాజా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

డివైడర్, లారీని ఢీకొని ఆక్సిజన్ ట్యాంకర్ బోల్తా

- 4 గంటలు స్తంభించిన ట్రాఫిక్

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై అల్లూరు రోడ్డు సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చెన్నై నుంచి విశాఖపట్నం వెళుతున్న ఆక్సిజన్ ట్యాంకర్ ఆదివారం అర్ధ రాత్రి డివైడరును, మరో లారీని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘనటలో ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా సుమారు 4 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సై జంపానికుమార్ కథనం మేరకు... అర్ధరాత్రి సుమారు 1.15 గంటల సమయంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కే మలుపులో ఏర్పాటు చేసిన సిమెంటు డివైడర్లను వేగంతో ఢీకొడుతూ వెళ్లి నెల్లూరు వైపు వెళు తున్న సిమెంట్ లారీని ఢీకొని బోల్తా పడింది. జాతీయ రహదారికి అడ్డంగా ఆక్సిజన్ ట్యాంకరు పడడంతో ఇరువైపుల ట్రాఫిక్ స్తంభించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు తొలగించి గ్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడిన ట్యాంకర్ డ్రైవర్ వికాష్ పాల్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




సిమెంట్ లారీని ఢీకొని బోల్తాపడిన ఆక్సిజన్ ట్యాంకర్

రూ.12వేలు కడితే రూ.1423కు రశీదిచ్చారు!

- ఇంటి పన్ను విషయంలో బాధితుడి ఆవేదన

బిట్రగుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఏడేళ్లగా ఇంట్లో నివాసం ఉండకుండా డోర్ లాక్ చేసి ఉన్న ఇంటికి రూ.12 వేల ఇంటి పన్ను కట్టించుకున్న సంబంధిత అధికారులు కేవలం రూ.1423 చెల్లించినట్లు రశీదు ఇచ్చారని బాధితుడు దుగ్గిరాల శాంతివర్ధన్ ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం ఆయన మాట్లాడుతూ బోగోలు పంచాయతీ అరవపాలెంకు చెందిన తన తల్లి దుగ్గిరాల రోజ్‌మేరీ పేరుపై ఉన్న ఇంటికి రూ.13 వేల పన్ను చెల్లించాలని ఈవో అబ్దుల్ జహీర్ చెప్పారని తెలిపాడు. అయితే ఏడేళ్లగా తాము ఇంట్లో లేమని, పన్ను తగ్గించాలనిని ఈవోను కోరగా రూ.1000 తగ్గించి రూ.12 వేల కట్టమని చెప్పారన్నారు. దీంతో మార్చి 15వ తేదీన రూ.10 వేల చెల్లించామని, ఆయన సూచన మేరకు మిగిలిన రూ.2 వేల గుమస్తా మనోహర్ ఫోన్‌పేకు పంపించామన్నారు. ఆ తరువాత అదే తేదీతో తాము రూ.1423 చెల్లించినట్లు రశీదు ఇచ్చారన్నారు. ఈ విషయమై తమతో పాటు కొందరు పెద్దలను తీసుకెళ్లి అడిగిస్తే ఈవో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని వాపోయారు. తమకు ఇచ్చిన రశీదు ప్రకారం తమ వద్ద అదనంగా రూ.10,577 వసూలు చేశారని, ఉన్నతాధికారులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.



శాంతివర్ధన్‌కు ఇచ్చిన రశీదు

మహిళ గొంతు కోసి పరారీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్నేహంగా ఉంటున్న వ్యక్తే ఆ మహిళ గొంతు కోసి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, నగరంలోని బోడిగాడితోటకు చెందిన ఓ మహిళకు భర్త చనిపోయాడు. ప్రస్తుతం ఆమె సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఆమెకు కపాడిపాలెంకు చెందిన రమేష్ పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో రమేష్ తన చెల్లెలు వద్ద ఆ మహిళకు కొంత నగదును అప్పుగా ఇప్పించాడు. ఈ క్రమంలో ఆదివారం రమేష్ ఫూటుగా మద్యం సేవించి మద్యం దుకాణం వద్దకు వచ్చాడు. ఆ మహిళ వద్దకు వెళ్లి నా చెల్లెలికి డబ్బులు ఎప్పుడు ఇస్తావంటూ దుర్భాషలాడాడు. దీంతో ఆమె అక్కడ నుంచి వెళుతుండగా రమేష్ చాకుతో ఆ గొంతుకోసి పరారయ్యాడు. గాయపడిన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ మేరకు బాధితురాలు ఆదివారం అర్ధరాత్రి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

బుచ్చిరెడ్డిపాళెం/రాపూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఆగివున్న కారును వెనుక నుంచి వచ్చి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంగం మండలం దువ్వూరు గ్రామానికి చెందిన సమద్ (51)అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడుపుతున్న షాన్వాజ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

ఇక, రాపూరు అరుంధతీయవాడకు చెందిన బొజ్జా కోటి (37) ద్విచక్ర వాహనంపై 565 జాతీయ రహదారి మీదుగా సోమవారం రాత్రి మద్దెలమడుగు నుంచి రాపూరు వైపు వస్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. అతనితోపాటు వెనుక కూర్చున్న పల్లిపాటి వెంకటస్వామి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన కోటిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. గాయపడిన వ్యక్తిని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మూడిళ్లలో చోరీ

- పడుగుపాడులో రూ.20వేలు, రెండు జతల బంగారు కమ్మలు
- కోవూరులో రూ.20వేల అపహరణ

కోవూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడుగుపాడు, కోవూరు గ్రామాల్లో ఆదివారం రాత్రి మూడిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులకు సోమవారం అందిన ఫిర్యాదుల మేరకు వివరాలిలా ఉన్నాయి. పడుగుపాడు పంచాయతీ పరిధిలోని వాగుమిట్ట ప్రాంతంలోని తోటకూర మధుసూదనరావు, రామిరెడ్డి దయాకరరెడ్డి కుటుంబసభ్యులు ఇళ్లకు తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. ఆ ఇళ్లలో ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించిన దొంగలు ఇంటికి తాళాలు పగులగొట్టి నగలు, నగదు కోసం గాలించారు. వస్తువుల్ని చిందరవందర చేశారు. తోటకూర మధుసూదన రావు ఇంట్లో రూ.15వేలు, రామిరెడ్డి దయాకరరెడ్డి ఇంట్లో రెండు జతల బంగారు కమ్మలను తీసుకెళ్లారు. అలాగే కోవూరు శాంతినగర్‌కు చెందిన సురేష్‌రెడ్డి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా రూ.20వేలు తీసుకెళ్లారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ శివప్రియ, ఎస్ఐ రంగనాథ్ గౌడ్ పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రల్ని సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు బోలెడు..

పరిష్కరించండి సార్..!

- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
- ఎండను సైతం లెక్కచేయకుండా తరలిరాక

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎండను సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్‌కు సోమవారం అర్జీదారులు పోటెత్తారు. భూ సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరుతూ అర్జీదారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాలు సమర్పించారు.దీంతో కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి సమస్యను నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

583 అర్జీలు

ఈ కార్యక్రమంలో 583 మంది అర్జీదారులు వినతులు సమర్పించారు. ఇందులో 245 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవే. మున్సిపల్ శాఖవి 39, సర్వే శాఖవి 51, పోలీసు శాఖవి 94 అర్జీలు ఉన్నాయి. అర్జీల స్వీకరణలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు,డ్వామా పీడీ గంగాభవానీ, డీసీవో డీ .శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సీఈవో విద్యారమ, తదితరులు పాల్గొన్నారు.



నియామకపు పత్రాలు అందుకున్నవారితో కలెక్టర్ ఆనంద్

నిమాయక పత్రాల అందజేత

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో సోమవారం విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ ఆనంద్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 2022 - 23 సంవత్సరానికి జారీ చేయబడిన ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు ఆయన ఈ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

నగరంలోని 47వ డివిజన్‌లో విద్యుత్ సరాఫరాలో హెచ్చుతగ్గుల సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకుడు శ్రీమంతుల కిషోర్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అధికంగా ఇంటి పన్ను వసూలు

ఇంటి పన్ను అధికంగా వసూలు చేస్తున్నారని బోగోలుకి చెందిన దుగ్గిరాల రోజ్‌మేరీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై అధికారులను అడిగితే సరిగ్గా సమాధానం చెప్పడం లేదని పేర్కొన్నారు.

తాగునీటి వసతి కల్పించాలి

కొత్తూరులోని ఆర్ఆర్ పునరావాస కాలనీలో తాగునీటి వసతి కల్పించాలని కాలనీవాసులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొందరు బావులను ఆక్రమించి తాగునీరు లేకుండా చేశారన్నారు. బావులను రక్షించి తాగునీటి వసతి కల్పించాలని కోరారు.

ఆర్థిక ప్రోత్సాహం అందించాలి

కౌలు రైతులకు ఎకరాకు రూ.3వేలు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ సోమవారం పౌరసరఫరాల సంస్థ ఏడీఎం సురేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, ఓ.సుధాకర్, అల్లి రవికుమార్‌యాదవ్, పల్నాటి సూర్యనారాయణ, పీ.ఆదినారాయణ, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు నిధులు స్వాహా చేశారు

రాపూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగు నిధులు స్వాహా చేశారని, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దక్కా చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మండే' ఎండల్లోనూ

100 వినతులు

పోలీసు గ్రీవెన్స్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండే ఎండల్లోనూ జిల్లాప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో 100 మంది ఫిర్యాదులు అందించారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఫిర్యాదులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. నగర డీఎస్పీ పీ సింధుప్రియ కూడా ఫిర్యాదులు స్వీకరించారు.

- తన అన్న చంపేస్తానని బెదిరిస్తున్నాడని, ఆయన నుంచి రక్షణ కల్పించాలని నగరంలోని చిన్నబజారుకు చెందిన సయ్యద్ షకీల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- నెల్లూరు బీవీనగర్‌కు చెందిన రమేష్‌రెడ్డి ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని తనను నమ్మించి రూ.8లక్షలు తీసుకున్నాడని కోవూరుకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఉద్యోగం ఇప్పించకపోగా, కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని కోరింది.
- హైదరాబాద్‌కి చెందిన అరవింద్, శ్రీకాంత్, అభిషేక్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.4.35 లక్షలు తీసుకొని, మోసం చేశారని వేదాయపాలెంకు చెందిన ఓ యువకుడు ఫిర్యాదు చేశాడు. న్యాయం చేయాలని కోరాడు.
- ఆస్తి పంచకపోతే ఇంట్లో నుంచి వెళ్లమని తన పెద్ద కుమారుడు బెదిరిస్తున్నాడని ఆత్మకూరుకి చెందిన ఓ వృద్ధుడు ఫిర్యాదు చేశాడు. నన్ను, నా భార్యను చిత్రహింసలు పెడుతున్నాడని, న్యాయం చేయాలని కోరాడు.
- ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకుంటానని ముసునూరుకి చెందిన చంద్రకాంత్ నమ్మించి మోసం చేశాడని గుడ్లూరుకు చెందిన బాధితురాలు ఫిర్యాదు చేశారు. అతనిపై నమ్మకంతో ఇద్దరం దగ్గరయ్యామని, అవసరమని చెప్పి తన వద్ద రూ.3లక్షలు తీసుకున్నాడని తెలిపింది. పెళ్లిచేసుకోవాలని కోరగా ముఖం చాటేశాడని, న్యాయం చేయాలని కోరింది.



ఫిర్యాదును పరిశీలిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100) : 440

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8534
వెండి కిలో ధర	రూ.95,200
వెండి ఒక గ్రాము	రూ.95.50

శేషవాహనంపై శ్రీరామచంద్రుడు



నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని త్యాగరాజస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్వామివారికి శేషవాహనసేవ, ప్రాకారోత్సవం జరిగాయి. ఉదయం తిరుమంజనం సేవ, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

కార్మికుల్లేరు.. వాహనాలు చాలవు!

చెత్త తొలగింపుపై కమిషనర్‌కు టీడీపీ నేతల వినతి

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి): నగరంలోని డివిజన్లలో చెత్త తొలగింపునకు సరిపడా కార్మికులు లేరని, ఉన్న వాహనాలు కూడా సరిపోవడం లేదని టీడీపీ నేతలు కమిషనర్‌కు విన్నవించారు. సోమవారం ఎన్‌ఎంసీ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజ నేతృత్వంలో సాగిన పీజీఆర్‌ఎస్‌లో ఈ మేరకు 19వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి మదన్ వినతిపత్రం అందచేశారు. తన డివిజన్‌లో 30 మంది వరకు పారిశుధ్య కార్మికులు అవసరం ఉండగా, కేవలం 15 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఉన్న నాలుగు వాహనాలు డివిజన్ మొత్తం చెత్తను తీసుకెళ్లాల్సి రావడంతో ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. టిడ్కో లబ్ధిదారులుగా ఉన్నవారికి వయసు ఎక్కువగా ఉండటంతో రుణాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

అందడం లేదని, 23వ డివిజన్‌లో తాగునీటి పైపులైన్లు లీకేజీ అవుతుందని జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున్‌యాదవ్ తెలిపారు. మరికొందరు కార్పొరేటర్లు, టీడీపీ, వైసీపీ నాయకులు డివిజన్లలోని సమస్యలపై వినతిపత్రాలు అందచేశారు.

● ఆక్రమణలు తొలగించండి

రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, ఇతర నిర్మాణాలను ఎవరికివారుగా స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. 28వ డివిజన్ జర్నలిస్టుకాలనీ, కేశవులనగర్, వేదాయపాళెం, మహాత్మాగాంధీనగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. రోడ్లపైకి వచ్చిన ఆక్రమణలను, వెంటనే తొలగించకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు. 23, 24 డివిజన్లలో ఎంహెచ్‌వో చైతన్య బ్లాక్‌స్పాట్లను గుర్తించి వాహనాల ద్వారా చెత్తను డంపింగ్ యార్డుకు తొలగించారు.



ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నర్సింగ్ విద్యార్థినులు

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

నెహ్రూ యువకేంద్రం అధికారి మహేంద్ర

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి తెలిపారు. నగరంలోని చైతన్యపురిలో గల ఓ నర్సింగ్ కళాశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహేంద్రరెడ్డి మాట్లాడుతూ శారీరక శ్రమ తప్పనిసరని, జంక్ ఫుడ్, వేపుళ్ల వంటి ఆహారాలు తగ్గించాలన్నారు. ముందుగా విద్యార్థినులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పీ వసుమతి, ఏ జయప్రకాష్, ఎస్ వేణుగోపాల్, కళాశాల కరస్పాండెంట్ దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం రాత్రి అంకురార్పణ జరిగింది. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్యుంగ్రహణం పూజలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ఛైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, ధర్మకర్తలు, సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు,ఆలయ సిబ్బంది, తదితరులు పర్యవేక్షించారు.

ఘర్షణపై మరో కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఘర్షణకు సంబంధించి సోమవారం మరో కేసు నమోదైంది. ఈనెల 4న ఇద్దరు న్యాయవాదుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి న్యాయవాది ఎం లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, మరో న్యాయవాది హరిబాబుపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లాక్కెళ్లాడు. సేకరించిన సమాచారం మేరకు వివరాలు... నెల్లూరు రూరల్ ప్రాంతం మార్కేండేయ కాలనీకు చెందిన పద్మావతి తన సోదరుడితో కలిసి బైక్‌పై గత శనివారం నెల్లూరుకి వచ్చారు. శ్రీరామ నవమికి పూజా సామగ్రి తీసుకొని నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు జాతీయరహదారిపై నుంచి సాయంత్రం ఇంటికి వెళుతున్నారు. ఈ క్రమంలో ప్రశాంతినగర్ స్విమ్మింగ్‌పూల్ వద్ద దెయ్యాలకాలనీ వైపు బైక్‌ను తిప్పుతుండగా, వెనుక నుంచి బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని వేగంగా వచ్చిన వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఈ మేరకు బాధితులు ఆదివారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజవాహనంపై సీతారాములు



ఇందుకూరుపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):జగదేవిపేటలోని సీతా రామస్వామి సోమవారం గజ వాహనంపై గ్రామపుర వీధుల్లో విహరించారు.వేడుకలో సుధాకర్ రెడ్డి, కూకటి వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు

పొదలకూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):పక్కాగృహాల అదనంగా చెల్లించే సొమ్మును ఇవ్వాలని ఇళ్ల నిర్మాణాల కాంట్రాక్టర్ బెదిరిస్తున్నట్లు ఇనుకుర్తి గిరిజన మహిళలు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇళ్ల నిర్మాణం నాసిరకంగా కట్టి అసంపూర్తిగా వదిలేశాడన్నారు. కార్యక్రమంలో పెంచలయ్య, వెంకటరమణమ్మ, నాగరత్నమ్మ, దీపిక, వెంకటమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

బీసీ సమరభేరీని జయప్రదం చేయాలి

కోవూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):నెల్లూరులో ఈనెల 11న నిర్వహించ తలపెట్టిన బీసీ సమరభేరిని జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి కడింపాటి అశోక్ పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం ఆయన బీఎస్పీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 'దేశంలో ఎవరి జనాభా ఎంతో.. వారి వాటా అంతే' అనే నినాదంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గరికపాటి చంద్ర ఉన్నారు.

నీళ్ల సీసాల వాహనం బోల్తా

మనుబోలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం వాటర్‌బాటిల్ వ్యాన్ బోల్తా పడింది. రేణిగుంటలోని పరిశ్రమ నుంచి బాటిళ్లతో నెల్లూరు వస్తుండగా టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి వ్యాన్ బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ కిరణ్, క్లీనర్ నితీష్‌లకు స్వల్పగాయాలయ్యాయి. రోడ్డంతా వాటర్ బాటిళ్లు పడిపోవడంతో ప్రయాణికులు బాటిళ్లను తీసుకెళ్లారు.

హంస వాహనంపై కోదండరాముడి దర్శనం

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): పెద్దూరు సీతా సమేత కోదండరామ స్వామి సోమవారం రాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 14వరకు ఆలయంలో శ్రీకృష్ణ భగవాన్ ట్రస్టు అశేషానంద గురువు ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామం పారాయణం నిర్వహిస్తారని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం స్వామివారు యాళివాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కోవూరు షుగర్స్ బకాయిలు త్వరగా చెల్లించండి

కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి భేటీ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్ ఆనంద్‌తో సమావేశమయ్యారు. రైతులు, కార్మికుల బకాయిలు త్వరగా చెల్లించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చక్కెర కర్మాగార భవితవ్యంపై రైతు సంఘం , కార్మిక సంఘం నేతల అభిప్రాయాలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పెన్నా డెల్టా నాయకులు గండవరపు శ్రీనివాసులురెడ్డి, హరిరెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, జెట్టి రవీంద్రరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

హంస వాహనంపై సీతారాముడు

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారికి సరస్వతీ అలంకారంలో హంస వాహనంపై పేట ఉత్సవం జరిగింది. కార్యక్రమాలను ఉభయకర్తలు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.



ఆంజనేయుడికి సింహవాహన సేవ

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంతపేట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి స్వామివారికి సింహ వాహనసేవ, పేట ఉత్సవం వైభవంగా జరిగాయి. ఉభయదాతలుగా ఒమ్మిన నాగసతీష్, భానుమతి వ్యవహరించారు. కార్యక్రమాలను ఈవో రఘురామయ్య పర్యవేక్షించారు.



వెనుకబడిన గ్రామాల్లోనే అభివృద్ధి జరగాలి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన గ్రామాల్లోని ప్రజలకే ఎక్కువ అభివృద్ధి ఫలాలు అందించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అప్పయ్యకండ్రికలో కర్మక్రతువుల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. వెనుకబడిన గ్రామాల్లో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

● నేడు టీడీపీ జెండా ఆవిష్కరణ

ప్రజాసమస్య పరిష్కరమే అజెండాగా గడప గడపకు.. గిరిధర్‌రెడ్డి అనే కార్యక్రమం మంగళవారం నాటికి 50వ రోజులకు చేరనున్నది. ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని టీడీపీ శ్రేణులు నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు కొత్తకాలువ కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడే గడపకు.. కార్యక్రమాన్ని మొదలుపెట్టనున్నారు. కాగా సోమవారం నారాయణరెడ్డిపేట బీసీకాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించిన గిరిధర్‌రెడ్డి స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు.

భక్తులకు నీడ కోసం పందిళ్లు



వేదగిరి లక్ష్మీనరసింహుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎండలో కాళ్లు కాలకుండా, ఆలయ అధికారులు రేకులతో పందిళ్లు వేశారు. ప్రయోగాత్మకంగా వీటిని ఆలయం ఎదుట సోమవారం ఏర్పాటు చేసి పరిశీలించారు. ఆలయం బయట నుంచి లోపలకు వెళ్లే భక్తులకు ఎండతీవ్రత దృష్ట్యా కాళ్లు కాలే అవకాశం ఉండటంతో వీటిని ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. -నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)



విజయ చిహ్నం చూపుతున్న విద్యార్థులు, అధికారులు

డిగ్రీలో 'కృష్ణచైతన్య'కు ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, పీ.రాణా ప్రమోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని కళాశాల ప్రాంగణంలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీఎస్‌సీ విభాగంలో షేక్.రుక్సానా పదిపాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, కే జోయల్ సునద్, పీవీ రచన, కే రాజేశ్వరి, బీ శ్రీజ, వీ.సుమ తర్వాత స్థానాల్లో నిలిచారన్నారు. బీసీఏలో కే.సుజన యూనివర్సిటీ టాపర్‌గా నిలవగా, ఎం చెంచుశ్రావ్య, సీహెచ్.వాసవి, విష్ణుప్రియ, మధు విజయలక్ష్మి, షేక్.షమియాభాను వరుస స్థానాలు సాధించారన్నారు. బీకామ్ లో షేక్.మోబిషిరా, పఠాన్‌యాస్మిన్, వీ.శివశంకర్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా, బీబీఏలో పీవీ.రుక్మిణివెన్నెల, పీ. అక్షిత ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారన్నారు. వీరితోపాటు మిగిలిన విద్యార్థులంతా కూడా 75శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని వారు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ బీ.సుధారాణి, అడ్మిన్ డీన్ సీ.రామాంజనేయులరెడ్డి, ప్రిన్సిపాలల్ ఎస్.నాగయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ ఈ.రమణయ్య, ఏ.రాజేష్‌రెడ్డి, బీ.వెంగల్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 47.68 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయంలో ప్రస్తుతం 47.68 టీఎంసీల నీరు నిల్వ ఉందని డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1420 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 1340 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

కొడిముద్దతో సంతానప్రాప్తి

● రేపటి నుంచి మనుబోలు సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు


● తిథి, వార, నక్షత్ర, ముహూర్తంతో పనిలేకుండా ఉత్సవాల నిర్వహణ

● 13న వైభవంగా రథోత్సవం

మనుబోలు, ఏప్రిల్ 8:మండల కేంద్రం నుంచి 6 కి.మీ దూరంలో రెండుఏరుల మధ్య సంగమేశ్వరాలయం ఉంది. అన్నిశివాలయాల కంటే భిన్నంగా ఆలయానికి రెండు ద్వారాలుంటాయి. తూర్పు ద్వారం గుండా ప్రవేశించి దక్షిణ ద్వారం గుండా వెలుపలికి రావాలి. ఆలయానికి అనుబంధంగా మనుబోలులో భవానీసమేత బ్రహ్మేశ్వరాలయం ఉంది. కామాక్షితాయి సమేత సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి మనుబోలులో జరగనున్నాయి. ఉత్సవాల్లో ధ్వజారోహణం, కల్యాణం, ధ్వజావరోహణం మిగతా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

● రథోత్సవమే ఉత్సవాల ప్రత్యేకం

అన్ని ఆలయాల ఉత్సవాల కంటే సంగమేశ్వరుడి ఉత్సవాలకు ఓ ప్రత్యేక ఉంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగాభవానీ సమేత బ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి 6కిలోమీటర్ల దూరంలోని సంగమేశ్వరాలయం వరకు వందల సంఖ్యలో భక్తులు పాల్గొని భుజాలపై మోసుకుని రథోత్సవం చేపడతారు. కల్యాణాంతరం శివపార్వతులను రథంలో మరలా మనుబోలు శివాలయంకు చేర్చుతారు.



పార్వతీపరమేశ్వరులు

ఉత్సవ వివరాలు..

ప్రతిఏటా తిథి, వార, నక్షత్ర, ముహూర్తంతో పనిలేకుండా పెద్దలకాలం నుంచి వస్తున్న పద్ధతిలోనే బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు చేపడతారు. 9న త్రిశూలేశ్వరుడి (శూలప్ప) పయనం, ధ్వజారోహణం, 10న చప్పరసేవ, 11న రావణసేవ, 12న నందిసేవ, 13న రథోత్సవం, 14న కల్యాణం, 15న వసంతోత్సవం, 16న పారువేట, 17న ఏకాంతసేవ, 18న శాంతి ఉత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ధ్వజావరోహణం రోజు ఇచ్చే కొడిముద్ద తింటే సంతానం లేనివారికి పిల్లలు కలుగుతారని భక్తుల నమ్మకం. దీనికోసం మహిళలు వరపడుతుంటారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఫైల్)

తిరునాళ్లలో డైమండ్ డబ్బా!

● కన్నెత్తి చూడని పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):కాగులపాడు, శ్రీరంగరాజుపురంలో జరుగుతున్న రాములోరి తిరునాళ్లలో డైమన్‌డబ్బాల జూదం విస్తృతంగా సాగుతోంది. శుక్రవారం నుంచి సాగుతున్న ఈ పందెం సోమవారంనాడు రూ.లక్షకుపైగా పందేలు కట్టే పరిస్థితికి చేరుకుంది. 70 శాతం మంది యువకులే ఈ పందెం కాస్తుండటం గమనార్హం. ఇంత జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలులేవు. కాగులపాడు, శ్రీ రంగరాజుపురం గ్రామాల మధ్య రోడ్డు పక్కనే సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో ఈ జూదం జరుగుతుండటం విశేషం.

గిరిజనులకు అండగా ప్రభుత్వం

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):గిరిజనులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తెలిపారు. సోమవారం కోడూరు బీచ్ పరిసర ప్రాంతాల్లోని గిరిజనులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుమినేని వాణీభవానీ నాయుడు, అంకెమ సందీప్, వెంకటాచలం మండల కార్యదర్శి సందురూ శ్రీహరి, శ్రావణ్, విజయ్, రావుల సాయి పాల్గొన్నారు.

బుచ్చి బీజేపీ మండల కమిటీ ఎన్నిక



బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల, వివిధ మోర్చాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సోమవారం బుచ్చిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రూరల్ కమిటీ, మోర్చాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వై.రోసిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, సీహెచ్.హరినారాయణ, వెంకటేశ్వర్లు రెడ్డి, రమణయ్య, సుధాకర్‌రెడ్డిలు, ప్రధాన కార్యదర్శులుగా పెజ్జాయి కృష్ణారెడ్డి, అల్లం మస్తానయ్య.. కార్యదర్శులుగా సీహెచ్ శేఖరయ్య, చిన జర్రాయిరెడ్డి, సీహెచ్.వెంకటరమణయ్య, ఎస్‌డీ. ఖులుసుంబీ, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, కోశాధికారిగా జనార్దన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే యువమోర్చా అధ్యక్షుడిగా మధుసూదన్, కిసాన్ మోర్చాకి ఎన్.సుబ్రమణ్యం, ఓబీసీ మోర్చాకు గండి సుబ్రమణ్యం, దళిత మోర్చాకి ఏడు కొండలు,గిరిజన మోర్చాకు రాగి ప్రసాద్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా ఎస్‌డీ. చాన్‌భాష, డాక్టర్ సెల్‌కు డాక్టర్ వంశీధర్ రెడ్డి, చేనేతసెల్‌కు యువ కుమార్‌లను ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రాఘవరెడ్డి, కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు గండి రఘురామయ్య పాల్గొన్నారు.

చెరుకుమూడి ఆలయంలో పూజలు

మనుబోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుమూడిలో గ్రామ టీడీపీ నాయకులు మేడికొండ శ్రీహరినాయుడు రూ.కోటితో కోదండరామాలయం నిర్మాణం చేసి సోమవారం ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతను అభినందించారు. అనంతరం గ్రామస్థులు, నాయకులతో ఆయన ఇష్టాగోష్ఠిగా చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, వద్దినేని మస్తాన్‌నాయుడు, మేడికొండ రామానాయుడు, దొడ్డపనేని రాజానాయుడు, మన్నెమాల భాస్కర్‌రెడ్డి, తిక్కవరపు బ్రదర్స్, విజయభాస్కర్ రెడ్డి, రాజాగౌడ్ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను వాడి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ వినియోగంలో నియోజకవర్గంను రాష్ట్రంలో నే రోల్ మోడల్‌గా మారుస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని కుడితిపాలెంలో రూ.2.77కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సోమవరం ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. రాబోవురోజుల్లో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే సోలార్ విద్యుత్‌ను వినియోగించాలని కోరారు. ఆక్వారంగ రైతాంగానికి నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తామన్నారు. అనంతరం ప్రశాంతిరెడ్డి ముదివర్తి, ముదివర్తిపాలెం కాజ్‌వే నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, పొన్నేబోయిన చెంచుకిషోర్‌యాదవ్, కొండూరు సుధాకర్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్, అవ్వారు ఏడుకొండలు, దొడ్ల మల్లికార్జున పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

వైస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం వైస్ చైర్మన్లుగా ఎర్రటపల్లి శివకుమార్‌రెడ్డి, పఠాన్ నస్రీన్ ఖాన్‌లు ప్రమాణస్వీకారం చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన సాధారణ సమావేశంలో కౌన్సిల్‌సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో 38అజెండాలు ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు వాటిని ఆమోదించారు. 20వార్డులుండగా తొలిదశలో 10వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కేటాయించారు. రెండోదశలో నిధులు కేటాయించాల్సిన వార్డులోని కౌన్సిలర్లు కొంతమంది వ్యతిరేకతను చాటారు. సమావేశంలో కమిషనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన రైతులు

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులకు గిట్టుబాటుధర కల్పించడంతోమండల రైతులు సోమవారం రాత్రి నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో 11,244టన్నుల ధాన్యం కొనుగోలుకు ఎమ్మెల్యే చేసిన ఉందని కొనియాడారు. కార్యక్రమంలో మాటూరు శ్రీనువాసులు రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పోలిరెడ్డి అశోక్‌రెడ్డి, వరదారెడ్డి, హరనాద్, శేషయ్య పాల్గొన్నారు.

దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి..

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ సేవాట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలియమ్స్‌పేట అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధురాలు రాములమ్మ, అడ్డొచ్చిన వంట నిర్వాహకుడిపై శుక్రవారం రా

Before the Honourable Deputy Registrar of Chits (O/o District Registrar), At Kadapa

Dispute No. DRK/CF No.13/2024

Between

M/s. Shriram Raghavendra Chits Pvt. Ltd., Kadapa Branch ... Disputant

Vs

A. Edukondalu and Others ... Opponents

Opponent No. OP1, OP3, OP4 కు నోటీసు

Opponent No.1 :- Mr. Appanagari Edukondalu S/o Appanagari Venkata Swamy, aged about 34 years, is working as Constable (SPF), Govt. of Andhra Pradesh, Commandant, HQrs, APSPF, Tirupathi Depart-ment working as SPF APGENCO Nellore, SPSR Nellore Dt, YSR Dt and is Residing at Otturu Village, Thummalapenta Kavali, SPSR Nellore Dt, Andhra Pradesh.


Opponent No.3:- Mr. Syamanaboina Venkata Anjaneyulu, S/o. Syamanaboina Subbarayudu, aged about 44 years, is working as Constable (SPF), Govt. of Andhra Pradesh, Commandant HQrs APSPF, Thirupathi Department, Working as SPF APGENCO Nellore, SPSR Nellore District and is Residing at Siva Sai Supermarket back side Muthakur Road, Dhanalakshmipuram, Gundlapalem, Nellore, SPSR Nellore District, Andhra Pradesh.

Opponent No.4 :- Mr. Tamide Gurappa, S/o. Tamide Gurappa aged about 45 years, is working as Constable (SPF), Govt. of Andhra Pradesh, Commandant HQrs APSPF, Thirupathi Department, Working as SPF APGENCO RTPP Kalamalla Muddanur, YSR District and is Residing at H.No. 2/123, Maruthi Nagar, Near SP Bungalow, Kadapa, YSR District, Andhra Pradesh.

డిస్‌ప్యూటెంట్ డిస్‌ప్యూట్ బాకీ మొత్తం **రూ.3,34,149/-లు** రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన డిస్‌ప్యూట్ ఆపోనెంటు **OP1, OP3, OP4** అయిన మీరు **23/04/2025వ తేదిన** హాజరు గుటకుగాను వాయిదా వున్నది. పై దినము 11.00 గం.లకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o. ది డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, బుద్ధ టౌన్‌షిప్, కడప వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

(By order of)

The Hon'ble Deputy Registrar of Chits/ Arbitrator. Dist. Registrar and Stamps Department, Near Budda Township, Kadapa



బీపీ బాధితులు
రాష్ట్రం : 19,78,699
జిల్లా : 67,330 (3.4 శాతం)
రాష్ట్రస్థాయిలో : 18వ స్థానం
రాయలసీమలో : 3

మధుమేహం బాధితులు
రాష్ట్రం : 11,13,963
జిల్లా : 57,211 (5.136 శాతం)
రాష్ట్రస్థాయిలో : 5వ స్థానం
రాయలసీమలో : మొదటి స్థానం

బీపీ.. డయాబెటిస్ రెండూ వున్న బాధితులు
రాష్ట్రం : 20,78,999
జిల్లా : 82,985 (3.992 శాతం)
రాష్ట్రస్థాయిలో : 14వ స్థానం
రాయలసీమలో : 1వ స్థానం



స్వీట్‌గా ముంచేస్తోంది

జిల్లాలో పెరుగుతున్న మధుమేహ బాధితులు
జనాల్లో రైజ్ అవుతున్న 'బీపీ'
రోడ్డు ప్రమాదాలూ ఎక్కువే
ఆందోళన కలిగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సర్వే ఫలితాలు

జిల్లాలో 'తియ్యటి' ప్రమాదం ముంచుకొస్తోంది. మధుమేహ బాధితుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అదే సమయంలో ఎక్కువ మంది హైపర్ టెన్షన్‌తో బీపీ బాధితులుగా మారుతున్నారు. ఇక, మధుమేహం, బీపీ.. రెండూ ఉన్న వారి సంఖ్యా 83 వేల వరకు ఉంటోంది. ఇక, మూడేళ్లుగా ఎన్టీఆర్ వైద్య సేవలు పొందిన రోగుల సంఖ్య.. రోడ్డు ప్రమాద గణాంకాలూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సర్వేలో వెల్లడైన ఈ అంశాలను సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం వెల్లడించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. 57 వేల మందికి పైగా బాధితులతో రాష్ట్రంలో 5వ స్థానం. రాయలసీమ జిల్లాలతో పోలిస్తే మొదటి స్థానంలో ఉంది. ఇక, హైపర్ టెన్షన్ బాధితుల పరంగానూ ఆందోళన కలిగించేలా ఉంది. రాష్ట్రంలో 18వ స్థానంలో ఉండగా.. రాయలసీమలో కడప, కర్నూలు జిల్లాల తర్వాత మూడవ స్థానంలో ఉన్నాం. ఇక, బీపీ, డయాబెటిస్ రెండూ ఉన్న బాధితుల్లోనూ మన జిల్లా రాయలసీమలో మొదటి స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతా ప్రమాణాల విషయంలో జిల్లా గణనీయంగా వెనుకబడి ఉంది. ప్రభుత్వం తాజాగా నిర్వహించిన సర్వేలో ఈ లోపాలు బయటపడ్డాయి. రోడ్డు భద్రతా చర్యలు సక్రమంగా లేనందున రాష్ట్రంలో కృష్ణా, చిత్తూరు జిల్లాల తర్వాత ఎక్కువ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తేలింది. రోడ్డు ప్రమాద ఘటనల్లో మృతులు, క్షతగాత్రుల సంఖ్య విషయంలో కూడా జిల్లా ఏపీలో మూడో స్థానంలో ఉంది.

ఎన్టీఆర్ వైద్య సేవలూ ఎక్కువే



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా సర్జరీలు, చికిత్సలు, ఔషధాలు పొందుతున్న వివిధ రకాల రోగుల సంఖ్య జిల్లాలో గణనీయంగా ఉంది. 2022-23 నుంచీ 2024-25 వరకూ మూడేళ్ల పాటు ఎన్టీఆర్ వైద్య సేవల కింద ప్రభుత్వ సాయం పొందిన వారి సంఖ్యను పరిశీలిస్తే ఈ అంశం వెల్లడైంది. వ్యాధుల వారీగా సేవలు అందుకున్న రోగుల వివరాలిలా వున్నాయి.




- కాలేయ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఏపీలో 30,646 మంది వుండగా అందులో జిల్లాలో 1829 మంది వున్నారు. 5.97 శాతం మందితో జిల్లా ఏపీలో 3వ స్థానంలో వుండడం ఆందోళన కలిగిస్తోంది. రాయలసీమలో అయితే కర్నూలు జిల్లా తర్వాత అత్యధిక రోగులు జిల్లాలోనే వున్నారు.



- దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ఏపీలో 54,362 మంది ఉండగా, అందులో 6.85 శాతం అంటే 3775 మందితో జిల్లా మూడో స్థానంలో వుంది. రాయలసీమ జిల్లాలతో పోలిస్తే మొదటి స్థానంలో ఉంది.



- రాష్ట్రంలో దీర్ఘకాలిక కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు 1,73,479 మంది ఉంటే, 5.02 శాతంతో అంటే 8700 మందితో జిల్లా ఆరవ స్థానంలోనూ, రాయలసీమలో మూడో స్థానంలోనూ వుంది.



- క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఏపీలో 1,19,397 మంది ఉండగా, అందులో 3.86 శాతం మంది అంటే 4607 మందితో జిల్లా 15వ స్థానంలో వుంది. రాయలసీమలో అయితే మొదటి స్థానంలో వుంది.

- నరాల సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారు రాష్ట్రంలో 1,07,433 మంది ఉన్నారు. అందులో 3.376 శాతం అంటే 3626 మందితో జిల్లా 18వ స్థానంలో ఉంది. రాయలసీమలో 4వ స్థానం.




- గుండె సంబంధిత వ్యాధిగ్రస్తుల విషయానికొస్తే రాష్ట్రంలో మొత్తం 2,61,100 మంది వుంటే వారిలో 2.753 శాతం అంటే 7,187 మందితో జిల్లా 21వ స్థానంలో వుంది. అదే రాయలసీమ పరిధిలో జిల్లా 6వ స్థానంలో వుంది.

ప్రతి నియోజకవర్గంలో వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

సీఎం చంద్రబాబు సోమవారం ప్రకటించిన మేరకు జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ వంద పడకల మల్టీ స్పెషాలిటీ లేదా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరుల్లో ఆ స్థాయి ప్రభుత్వాస్పత్రులు ఇప్పటికే వున్నాయి. తిరుపతిలో టీటీడీ నిర్వహణలో స్విమ్స్, పద్మావతి ఆస్పత్రులు ఉండగా, ప్రైవేటు రంగంలో ఒకటి ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండలంలోనూ ఆ స్థాయి ప్రైవేటు ఆస్పత్రి వుంది. వెంకటగిరి, చంద్రగిరిలో వంద పడకలకు తగ్గ భవనాల నిర్మాణం జరిగినా ప్రభుత్వం ఇంకా ఆ స్థాయి కల్పించలేదు. సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో 30 పడకల ఆస్పత్రులే వున్నాయి. సీఎం ప్రకటన ఆచరణ రూపం దాలిస్తే త్వరలో వెంకటగిరి, చంద్రగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లోనూ పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు కానున్నాయి.

ఫీల్డ్ విజిట్ తర్వాతే బాండ్లు జారీ

- నాలుగో రోజూ క్యూ కట్టిన టీడీఆర్ బాధితులు
- 284 డాక్యుమెంట్లు లాగిన్



టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌లో అర్జీలు స్వీకరిస్తున్న రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అదనపు డైరెక్టర్ వరప్రసాద్

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల జారీ స్పెషల్ డ్రైవ్ నాలుగో రోజైన సోమవారం బాధితులు కార్పొరేషన్ కార్యాలయానికి క్యూ కట్టారు. డాక్యుమెంట్లను తీసుకొచ్చి టౌన్ ప్లానింగ్ సిబ్బందికి అందజేశారు. గడిచిన నాలుగు రోజులుగా 29 మాస్టర్ ప్లాన్ రోడ్లకు గాను 26కు సంబంధించి 284 ఆస్తుల డాక్యుమెంట్లకు లాగిన్ చేశారు. 190 దరఖాస్తులకు వాలిడేషన్ పూర్తిచేయగా మరో 94 సిద్ధంగా ఉన్నాయి. 21 టీడీఆర్ దరఖాస్తులను సిటిజెన్స్ లాగిన్‌లో అప్‌లోడ్ చేశారు. మంగళగిరి నుంచి వచ్చిన టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ వరప్రసాద్ మేళాను పర్యవేక్షించారు. అర్హుల జాబితా కొలిక్కి వచ్చాక క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే బాండ్లు జారీ చేస్తామని చెప్పారు.

స్థలం మాది... బాండ్లు మరొకరికి

హీరోహోండా షోరూం పక్కన వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డుకు నా స్థలం కోల్పోయాను. టీడీఆర్ బాండ్లు నాకు కాకుండా, తప్పుడు పత్రాలు సమర్పించిన వ్యక్తికి ఇచ్చేశారు. న్యాయం చేయాలని పలుమార్లు అధికారులను కలిశాను. హైకోర్టునూ ఆశ్రయించాను. డాక్యుమెంట్లు పరిశీలించి అర్హుడైన నాకు బాండ్లు ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చా.

- శ్రీహరి రెడ్డి, తిరుపతి

బాండ్లను రిలీజ్ చేయమని కోరా

డీబీఆర్ మాస్టర్ ప్లాన్ రోడ్డులో 400 చదరపు గజాల స్థలాన్ని కోల్పోయాం. గతంలోనే టీడీఆర్ బాండ్లు తీసుకున్నాం. బాండ్ల జారీలో జరిగిన అవకతవకల ఆరోపణల నేపథ్యంలో మాకిచ్చిన బాండ్లనూ హోల్డ్‌లో పెట్టారు. వాటిని వినియోగించుకునేందుకు వీలుగా విడుదల చేయాలని కోరా.

- ప్రసాద్, ఏడీసీ, చిత్తూరు నగరపాలక సంస్థ

వీఆర్వో ఏమయ్యారు?

- 16 మందికి పంపిణీ చేయని పింఛను
- వారమైనా కానరాని ఆచూకీ

సత్యవేడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సత్యవేడు-1వ సచివాలయంలోని వీఆర్వో చిట్టిబాబు తన పరిధిలోని 16 మందికి ఇంకా పింఛను పంపిణీ చేయలేదు. వారమైనా ఆయన ఆచూకీ లేదు. దీంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ సచివాలయ పరిధిలో 64 మందికి పింఛను అందించడానికి రూ.2.68లక్షలను వీఆర్వో చిట్టిబాబుకు పంచాయతీ కార్యదర్శి ఇచ్చారు. 48 మందికి రూ.2.02 లక్షలను పంపిణీ చేసిన వీఆర్వో.. 16 మందికి ఇవ్వలేదు. ఈ విషయం తెలిసి ఉన్నతాధికారులు ఫోన్‌ద్వారా వీఆర్వోను సంప్రదించగా, ఆర్డీవో కార్యాలయంలో అత్యవసర సమావేశానికి వెళ్లడంతో పంపిణీ చేయలేకపోయినట్లు చెప్పారు. కానీ, వారం రోజులవుతున్నా వీఆర్వో ఆచూకీ లేదని, ఆయన సెల్‌ఫోను స్విచ్చాఫ్ అయినట్టు పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ చెప్పారు. కాగా, మండలంలోని కాళమనాయుడుపేట సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ షాహిదుల్లా కొత్తమారికుప్పంలో లబ్ధిదారులకు ఈనెల పింఛను రూ.2,63,000 ఇవ్వకుండా పరారైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీఆర్వో వైఖరిపై అధికారుల్లో ఆందోళన నెలకొంది.

'ఆల్తూరుపాడు'కు రూ.669 కోట్లతో కొత్త ప్రతిపాదనలు

వెంకటగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం ఆల్తూరుపాడులో 1.4 టీఎంసీల నీటిని నిల్వచేసే సామర్థ్యంతో రిజర్వాయరు నిర్మాణానికి కొత్తగా రూ.669 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణంలో భాగంగా ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులను 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.310 కోట్లతో మొదలు పెట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రీ టెండరు పిలిచారు. 26 శాతం లెస్‌కు కాంట్రాక్టు దక్కించుకున్న కడపకు చెందిన ఓ కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. దీంతో ఈ రిజర్వాయరును వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. చంద్రబాబు సీఎం కాగానే.. ఈ ప్రాజెక్టుకు కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కొత్త ప్రతిపాదనలను ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి పంపనున్నారు. వచ్చే నెలలో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఈ రిజర్వాయరు పూర్తయితే వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో 97 వేల ఎకరాలకు సాగునీరు.. శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమలకు తాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ కొత్త ప్రతిపాదనలను సోమవారం వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రాధాకృష్ణకు తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రిజర్వాయరును జగన్ ప్రభుత్వం అడ్డుకోవడంతో నిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. మట్టికట్టకు అవసరమైన 50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల్లోని చెరువుల్లో తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో తెలుగుగంగ డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య తదితరులున్నారు.



ప్రతిపాదనలను ఎమ్మెల్యేకి అందచేస్తున్న టీజీపీ ఈఈ రాధాకృష్ణ

ఎక్కువ 'సివిల్' తగాదాలే

- పోలీసు పీజీఆర్ఎస్‌కు 121 ఫిర్యాదులు
- ఏం చేయాలంటూ తలలు పట్టుకుంటున్న అధికారులు



ఫిర్యాదుదారుల వినతులు స్వీకరించి సమస్య వింటున్న అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్‌కు 121 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, ఆక్రమణలు, సరిహద్దు సమస్యలు, ఆర్థిక సమస్యలు, భార్యాభర్తల తగాదాలు, విడాకుల కేసులు, వరకట్న వేధింపులు తదితరాలున్నాయి. వచ్చే ఫిర్యాదుల్లో 80 శాతం వరకు 'సివిల్' తగాదాలే ఉండటంతో వాటిల్లో తల దూరిస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విభాగానికి సంబంధించి పరిష్కారమయ్యే సమస్యలు పెద్దగా రావడంలేదని కొందరు సిబ్బంది చెబుతున్నారు ముఖ్యంగా కోర్టుల్లో ఉన్న భార్యాభర్తల సమస్యలు ఫిర్యాదుల రూపంలో వస్తుండడంతో సూచనలు ఇచ్చి పంపుతున్నారు. కొన్ని తగాదాలకు సంబంధించి న్యాయపరంగా కోర్టుకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'సివిల్ తగాదాలపై ఫిర్యాదులు తీసుకోకుంటే జనం అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఒకవేళ తీసుకుంటే.. పరిష్కార చర్యలు మా పరిధిలో లేవు' అని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తనకు ఇష్టం లేకున్నా 17వ సంత్సరంలోనే తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేశారని, పెళ్లయిన ఈ మూడు నెలల్లోనే తనను భర్త చిత్ర హింసలు పెట్టి వేధిస్తున్నాడని ఓ బాలిక ఏఎస్పీ వద్ద ఆవేదన చెందారు. ఈ సమ్యను సీరియస్‌గా పరిశీలించి ఆ బాలికకు న్యాయం చేయాలని శ్రీకాళహస్తి సీఐని ఏఎస్పీ ఆదేశించారు. ఈ ఈ కార్యక్రమంలో వివిధ సర్కిళ్ల నుంచి వచ్చిన సీఐలు మురళి, సాధిక్ అలీ, శరత్‌చంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఇమ్రాన్ బాషా, శ్రీరాములు, ఎస్పీ కార్యాలయం నుంచి సీఐ శ్రీరాములు, బాబి, హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వాయిదా వేయండి!

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నేపథ్యంలో కలెక్టర్‌కు ఎమ్మెల్యే అభ్యర్థన



కలెక్టర్‌ను కలిసేందుకు అనుచరులతో వచ్చిన ఎమ్మెల్యే కురుగొండ్ల

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం ముఖ్య అనుచరులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఉద్దేశించిన కౌన్సిల్ సమావేశాన్ని నెలాఖరు వరకూ వాయిదా వేయాలని కోరినట్టు తెలిసింది. కౌన్సిల్‌లోని 25 మంది కౌన్సిలర్లూ వైసీపీ వారే. చైర్‌పర్సన్‌గా నక్కా భానుప్రియను ఎన్నుకున్నారు. గతేడాది ప్రభుత్వం మారడంతో ముగ్గురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. మరో 13 మంది వైసీపీ కౌన్సిలర్లు కలిపి మొత్తం 16 మంది గత నెల 19వ తేదీన కలెక్టర్‌ను కలసి చైర్‌పర్సన్ భానుప్రియపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి సమావేశం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం నెల రోజుల్లోపు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి. తొలుత 16 మంది వైసీపీ సభ్యులు చైర్‌పర్సన్ భానుప్రియకు ప్రత్యామ్నాయంగా మరో మాజీ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని నిర్ణయించారు. దీనివెనుక టీడీపీ ముఖ్యనేత ఒకరు కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ అప్రమత్తమై అసంతృప్తితో ఉన్న 13 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం జోలికి వెళ్లకుండా నచ్చజెప్పారని సమాచారం. దీంతో కౌన్సిల్ సమావేశం జరిగినా చైర్‌పర్సన్‌ను తొలగించే పరిస్థితి లేదని గ్రహించిన టీడీపీ నేతలు కొంత గడువు తీసుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది. అందులో భాగంగానే సోమవారం కలెక్టర్‌ను ఎమ్మెల్యే కలిసి సమావేశం వాయిదా వేయాలని అభ్యర్థించినట్టు టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. గత నెల 16 మంది సభ్యులు ఇచ్చిన నోటీసును రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపిన నేపథ్యంలో.. వారి దృష్టికి తీసుకెళతామని, వారిచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేసినట్టు తెలిసింది.

వడదెబ్బతో రైతు మృతి



గురవయ్య (ఫైల్ ఫొటో)

పిచ్చాటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీ తులసికృష్ణాపురానికి చెందిన రైతు గురవయ్య(55) సోమవారం ఉదయం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయన వడదెబ్బకు గురైనట్లు చెప్పారు. విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని ఇంట్లోనే పడుకోబెట్టారు. సోమవారం వేకువ జామున పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

10 నుంచి హుస్సేనమ్మ గంధోత్సవాలు


నెలబల్లి హుస్సేనమ్మ దర్గా

దొరవారిసత్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి వద్ద ఉన్న హుస్సేనమ్మ దర్గాలో ఈనెల 10 నుంచి గంధోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో మొదటి రోజు గంధం ఊరేగింపు, గ్రామోత్సవం జరుగుతుంది. రెండు, మూడు రోజుల్లో భక్తుల సందర్శన సమయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపడుతారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. హుస్సేనమ్మ దర్గాను దర్శించుకుంటే కోర్కెలు నెరవేరుతాయని, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తే పుత్రసంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. స్థానికులతో పాటు తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేయనుండడంతో దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రాస్‌రోడ్డులో తప్పని ట్రాఫిక్ కష్టాలు


క్రాస్ రోడ్డు వద్ద వాహనదారుల ఇబ్బందులు

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, చెన్నై మార్గాల కూడలి ప్రాంతమైన క్రాస్‌రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. గత ఏడాది డిసెంబరు 14వ తేదీన క్రాస్‌రోడ్డు వద్ద పోలేరమ్మ ఆర్చి నిర్మానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నేతృత్వంలో శంకుస్థాపన చేశారు. నిర్మాణం ఆది నుంచి నత్తనడన సాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా ఆర్చి నిర్మాణ పనులు ముగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుల దూషణపై విచారణ


వీరారెడ్డి సత్రంలో సాక్షులను విచారిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం పంచాయతీ వీరారెడ్డి సత్రంలో కులదూషణపై సోమవారం డీఎస్పీ గీతాకుమారి బహిరంగ విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితం వీరారెడ్డి సత్రంలో గిరిజనులైన జయమ్మ, ఆమె కుమారుడు నరసింహలను అదే గ్రామానికి చెందిన కుడుముల మస్తానయ్య కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. సోమవారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి విచారణ జరిపారు. ఆమె వెంట ఎస్ఐ పవన్ కుమార్ ఉన్నారు.

భూ పరిహారంపై అభ్యంతరాల స్వీకరణ


రైతుల నుంచి అభ్యంతరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ భూముల పరిహారానికి సంబంధించి అంభ్యంతరాలు స్వీకరించారు. బాలాయపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, వడమాలపేట డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ రెడ్డి, సర్వేయర్ గోపిరెడ్డి, పలువురు వీఆర్వోలు భూములు కోల్పోయిన రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు.

20న టెక్ వ్యూహ జాతీయ సదస్సు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 20వ తేదీన టెక్ వ్యూహ 2025 జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణ, డాక్టర్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

గూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ తిరుపతయ్య అన్నారు. సోమవారం స్థానిక గాయత్రి పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, మస్తాన్బీ, ఉమామహేశ్వరి, హరిత, జ్యోతి, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎస్ఐ తిరుపతయ్య

దొంగతనం కేసులో 6 నెలల జైలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం గూడూరు కోర్టులో న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 25వ తేదీన తాళమ్మగుడి సమీపంలో నివాసం ఉంటున్న సుబ్రహ్మణ్యం తన పొలంలో రాగివైరు, పైపులు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి పట్టణానికి చెందిన శీనయ్య దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచారు. విచారణలో నేరం రుజువుకావడంతో నిందితుడికి 6 నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మోటరు సైక్లిస్టు మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మోటరు సైక్లిస్టు మృతి చెందాడు. అర్బన్ సీఐ బాబి తెలిపిన వివరాల మేరకు... మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఈగ పుల్లయ్య(40) మోటరుసైకిల్‌పై ఆదివారం రాత్రి నాయుడుపేటకు వెళ్తుండగా తుమ్మూరు వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడాడు. 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పులయ్య మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఫ్లెక్సీ చించివేసిన ఇద్దరిపై కేసు

చిల్లకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం గ్రామంలో టీడీపీ నాయకుడు గోను శ్రీనివాసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో తాను ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీని అదే గ్రామానికి చెందిన జోగి అంకారావు, చెన్నైకి చెందిన బేదర్ల కృష్ణ చించి వేశారని గోను శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జోగి అంకారావు, బేదర్ల కృష్ణపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



మన్నెముత్తేరిలో ప్రైవేట్ లే అవుట్‌లో, దావాదిగుంట వద్ద జగనన్న లేఅవుట్ సమీపంలో అవసరం లేని చోట వేసిన సిమెంటు రోడ్లు

అనుమతి ఒకచోట... పనులు మరోచోట

- ఇష్టానుసారంగా పల్లెపండగ పనులు
- అవసరం లేనిచోట సిమెంటు రోడ్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


ఉగ్గుముడిలో చెరువు కట్ట వద్దకు వేసిన సిమెంటు రోడ్లు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పల్లెలు అభివృద్ధికి దూరమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చాక పల్లెపండగ పేరుతో పెద్దఎత్తున గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ఎక్కడా మట్టిరోడ్డు ఉండకూడదనే ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అవసరమున్నచోట సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ఉపాధి హామీ నిధులు ఖర్చు చేయాలని నిర్దేశించారు. అయితే కొందరు నాయకులు అవసరం లేనిచోట రోడ్లు వేసి బిల్లులు పొందేందుకు పన్నాగం వేశారు. సూళ్లూరుపేట మండలంలోని 19 పంచాయతీలకు పల్లెపండగ కింద తొలివిడత 25 సిమెంటు రోడ్లు మంజూరయ్యాయి. ఇందుకోసం రూ.1.80 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. మళ్లీ అదనంగా 12 సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.56 లక్షలు ఇచ్చింది. తదుపరి రూ.60 లక్షలు ఒక్కసారి, రూ.30 లక్షలు మరోసారి, ఇలా మొత్తం రూ.3.20 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు గ్రామాల్లో పనులు కూడా చకచకా సాగాయి. అయితే పనులు దక్కించుకొన్న నాయకులు అనుమతి ఒకచోట తీసుకొని.. రోడ్ల నిర్మాణాలు మాత్రం మరోచోట చేస్తున్నారు. ప్రైవేట్ లే అవుట్లు, పొలాలు, చెరువు కట్ట తదిర ప్రాంతాల్లో అవసరం లేని చోట్ల నిర్మాణాలు చేపట్టేశారు. సూళ్లూరుపేట మండలం మన్నెముత్తేరిలో మద్దిలేటమ్మ ఆలయం పక్కనే ఉన్న ప్రైవేట్ లేఅవుట్‌కు సిమెంటు రోడ్డు నిర్మించారు. అదేమని ప్రశ్నిస్తే ఎస్సీ కాలనీకి రూ.5 లక్షలతో 150 మీటర్ల సిమెంటు రోడ్డు మంజూరైందని, అక్కడ 100 మీటర్ల రోడ్డు నిర్మించి మిగిలింది లే అవుట్‌కు వేశామని చెబుతున్నారు. అదేవిధంగా ఉగ్గుముడి గ్రామంలో అనుమతి ఒకచోట తీసుకొని చెరువు కట్టకు 50 మీటర్ల మేర సిమెంటు రోడ్డు వేశారు. అలాగే కేసియన్‌గుంట వద్ద రూ.10 లక్షలతో జగనన్న లేఅవుట్‌కు సిమెంటు రోడ్డు వేశారు. ఈ లే అవుట్‌లో ముళ్లపొదలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఇక్కడ అవసరం లేకపోయిన సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇవన్నీ తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పౌష్టికాహారం, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తుమ్మూరు అర్బన్ హెల్త్‌సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యులను న్యాయమూర్తి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశ చెంచుకృష్ణయ్య, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, న్యాయవాది సుమన్, ఎస్ఐ ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

పెళ్లకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సంబంధిత సమస్యలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి నెంబరు ఇస్తున్నామని చెప్పారు. అనంతరం క్షేత్రస్థాయిలో విచారించి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామాల్లో కోర్టు కేసులతో పాటు దీర్ఘకాలంగా ఉన్న కుటుంబ వివాదాల కారణంగా భూ సమస్యలు పరిష్కరించేందుకు ఆలస్యమవుతోందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, తేజ, మోబీనా, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి

చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) కోట పట్టణంలోని దళితవాడలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం జరిగింది. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శేషవాహనంపై సంగమేశ్వరుడు


కామాక్షీదేవి, సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలు

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై ఊరేగారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు కామాక్షీదేవి, సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

వాకాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు వాకర్స్ అసోషియేషన్ సభ్యులు వైద్యాధికారి రోహిత్ జేమ్స్ చేతల మీదుగా పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు జాలాది కిషోర్ మాట్లాడుతూ... సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార అలవాట్లే కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారం, తగినంత నీరు తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్సన్, వాకర్స్ అసోషియేషన్ వైస్ చైర్మన్ రాజకుమార్, ట్రెజరర్ రాగూర్, జనరల్ సెక్రటరీ భరత్ మహిపతి, దాతలు సుమన్, సుధాకర్, జిలాని, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోషియేషన్ సభ్యులు

విద్యార్థులకు వ్యాయామం తప్పనిసరి



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న యోగా మాస్టర్ రాజా

గూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యాయామం తప్పనిసరిగా ఉండాలని యోగా మాస్టర్ రాజా అన్నారు. సోమవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో మేధాశక్తి, శారీరక ప్రవర్తనలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంత పొందడంతో పాటు చదువులపై ఏకాగ్రత సాధించవచ్చునన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకో వాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని కష్టపడి చదివి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అంకురార్పణ పూజల్లో అర్చకులు

గూడూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేనారాధనమ్, పుణ్యాహవాచనమ్, వాస్తుపూజలు జరిపి అంకురార్పణ చేశారు. ఉభయదాతలుగా సురేష్‌బాబు వ్యవహరించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రజా విజ్ఞప్తులకు సత్వర పరిష్కారం

డక్కిలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తులకు సత్వర పరిష్కారం చూపుతామని తహసీల్దారు శ్రీనివాసులు చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి మ్యుటేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఎక్కువగా అర్జీలు అందినట్లు చెప్పారు. అనంతరం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో తహసీల్దారు సమావేశమై పరిష్కారానికి నోచుకొని సమస్యల గుర్తించి సమీక్షించారు.


ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు


అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ అనుమతి లేని, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు అక్రమ, అనుమతులు లేని నిర్మాణదారులు 74 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. వీరిలో 26 మంది ఎటువంటి స్పందన లేకపోవండతో వారిపై కోర్టులో కేసులు దాఖలు వేశామన్నారు. అక్రమ నిర్మాణాల నుంచి దాదాపు రూ.3 కోట్ల పరిహారం మున్సిపాలిటీకి అందనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ తనిఖీల్లో డీపీవో బాలసుబ్రహ్మణ్యం, ప్లానింగ్ సెక్రటరీ హుమయూన్, శీను తదితరులు పాల్గొన్నారు.

యోగా, వ్యాయామంతో ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

చిల్లకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయామం చేయడంతో పాటు పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండారని డాక్టర్ షాలోమ్ అరాఫత్ అన్నారు. సోమవారం చిల్లకూరు పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షాలోమ్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో ఎక్కువ మంది శుభ్రమైన ఆహారాన్ని తీసుకోకపోవడంతో పాటు యోగా, వ్యాయామాలకు దూరంగా ఉంటూ రోగాల భారీన పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రవికుమార్, లక్ష్మి, గౌరీ, గోపి, పోలమ్మ, షాబీరా, సావిత్రి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


టీడీపీ సభ్యత్వ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను సోమవారం ఎమ్మెల్యే రామకృష్ణ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందిన కార్యకర్త ప్రమాదవ శాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ..5 లక్షలు బీమా అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, పప్పు చంద్రమౌళి రెడ్డి, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, బాబు నాయుడు, గద్దం చంద్రశేఖరరెడ్డి, బొలిగల వెంకటసుబ్బయ్య, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.